

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

# వార్త


## జాతీయ రహదారిపై ప్రమాద స్థలాలను పరిశీలించిన అధికారులు



**ఉలవపాడు, ఆగస్టు28, ప్రభాతవార్త** జాతీయ రహదారిపై తరుచూ ప్రమాదాలు జరుగుతుండడంతో నివారణ చర్యల్లో భాగంగా సోమవారం కందుకూరు సిఐ నఫీజ్ భాషా, మోటార్ వాహనాల ఇన్స్పెక్టర్ మహమ్మద్ రఫీ నేషనల్ హైవే అధికారులతో కలిసి తరుచూ జాతీయ రహదారిపై ప్రమాదాలు జరుగు ప్రాంతాలను పరిశీలించారు. మండలంలోని కరేడు ర్యాంపు మన్నేటికోట అడ్డరోడ్డు ఉలవపాడు ఉత్తర, దక్షిణ బైపాస్ రోడ్డును పరిశీలించి లూప్ రోడ్లు నుండి జాతీయ రహదారిపైకి వచ్చే ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు నిర్మాణాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఉలవపాడు ఎస్సై బాజిరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జగనన్నకు చెబుదాం అర్జీలను నిశితంగా పరిశీలించాలి



**నెల్లూరు అర్బన్, ఆగస్టు 28, ప్రభాతవార్త** జగనన్నకు చెబుదాం(స్పందన)అర్జీలను నిశితంగా పరిశీలించి అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపించాలని జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ స్పందన కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి సంబంధిత అధికారులకు అందజేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యవసరమైన అర్జీలను వెంటనే స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు స్పందన అర్జీల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వస్తున్న అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. నిర్ధిష్ట గడువు లోగా అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టి, అర్జీలు పునరావృతం కాకుండా పరిష్కరించాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు తమకు సంబంధించిన అర్జీలను ముందుగా పరిశీలించాలన్నారు. వచ్చిన అర్జీలు మళ్లీ మళ్లీ వస్తుంటే దరఖాస్తుదారుడి వద్దకు వెళ్లి సమస్య ఎందుకు పరిష్కారం కావడం లేదో అర్థమయ్యేలా వివరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, డీఆర్వో వెంకట నారాయణమ్మ, జడ్పీ సీఈఓ చిరంజీవి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి సంగతి దేవుడెరుగు...ఉన్న సౌకర్యాలు కూడా దశల వారీగా ఎత్తివేత

**బిట్రగుంట, ఆగస్టు 28 ప్రభాతవార్త** విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని బిట్రగుంటకు రైల్వే పరంగా పూర్వ వైభవాన్ని తీసుకొస్తామని ఇక్కడ వందలాది ఎకరాలు రైల్వే ఆస్తులు నిరుయోగంగా వుంటే వాటిని సద్వినియోగం తీసుకొచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ప్రజాప్రతినిధులు, నేతలు చెబుతున్న మాటలు వాగ్దానాలకే పరిమితమవుతున్నాయి. బిట్రగుంటకు రైల్వే పరంగా పూర్వవైభవం, అభివృద్ధి మాట దేవుడెరుగు కానీ ఇక్కడ వున్న సౌకర్యాలు దశల వారీగా ఎత్తివేస్తూ రైల్వే ఉన్నతాధికారులు ఆదేశాలివ్వడం ఈ ప్రాంత ప్రజలకు నిరుత్సాహాన్ని కలిగిస్తున్నాయి. ప్రతి సార్వత్రిక ఎన్నికలలో ఇక్కడ రైల్వే అభివృద్ధి ఎన్నికల మేనిఫెస్టోలో చేరుస్తున్నారే తప్ప ఆ తదుపరి జిల్లాలో పట్టుకున్న నాయకులు ఏమి సాధించలేకపోతున్నారు. కేంద్ర ప్రభుత్వానికి అవసరమైన చట్టాల సవరణ కోసం, బిల్లుల ఆమోదం కోసం పరోక్షంగా రాష్ట్రానికి చెందిన పార్లమెంటు సభ్యులు, రాజ్యసభ సభ్యులు మద్దతు తెలుపుతున్నారు. వందలాది ఎకరాల రైల్వే ఆస్తులు నిరుపయోగంగా అన్యాక్రాంతమవుతున్నా వీటిపై కలిసికట్టుగా కేంద్రాన్ని నిలదీసే ప్రజాప్రతినిధులు కరవయ్యారు. ఇక్కడ రైల్వే పరంగా అభివృద్ధి చేయాలంటూ జిల్లాకు చెందిన పార్లమెంటు సభ్యులు, రాజ్యసభ సభ్యులు ఇచ్చిన వినతి పత్రాలను కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ చెత్తబుట్టలో వేస్తున్నారే తప్ప పరిశీలించిన దాఖలాలు లేవు. తాజాగా బిట్రగుంట రైల్వే స్టేషన్‌తో పాటు జిల్లాలో మరో ఆరు రైల్వే స్టేషన్లలలో రిజర్వేషన్ల కౌంటర్లు ఎత్తివేస్తూ రైల్వే టికెట్ల విక్రయం ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తూ రైల్వే శాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో ఎన్‌జిఎస్-6 కేటగిరికి చెందిన 27 రైల్వే స్టేషన్లు, ఎంబిఎస్-5 కేటగిరికి చెందిన రెండు రైల్వే స్టేషన్లలో టికెట్ల విక్రయాలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెబుతూ అందుకు దరఖాస్తులు చేసుకోవాలని డివిజన్ కమర్షియల్ మేనేజర్ రాంబాబు ఆదేశాలు జారీ చేశారు. ఆ జాబితాలో జిల్లాలో బిట్రగుంట, కొడవలూరు, పడుగుపాడు, వెంకటాచలం, మనుబోలు, తెట్టు, ఉలవపాడు స్టేషన్లు వున్నాయి. బిట్రగుంటలో రైల్వే రిజర్వేషన్ కౌంటర్ తీసివేస్తుండటంతో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సుమారు 500 మంది రైల్వే కార్మికులు, విశ్రాంత ఉద్యోగులు, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పలువురు రాజకీయ ప్రముఖులు ఇక నుంచి ఈ సేవలకు దూరం కానున్నారు. వీరు రిజర్వేషన్ చేయించుకోవాలంటే నెల్లూరు, కావలి రైల్వే స్టేషన్లలో టికెట్ బుకింగ్ కార్యాలయం ఎదుట పడిగాపులు కాయాల్సి వస్తుంది. జిల్లాలో ఈ ఏడు రైల్వే స్టేషన్లలో టికెట్ బుకింగ్ ద్వారా సరిపడా ఆదాయం రోజు వారీగా రాకపోవడంతో వీటిల్ని ప్రైవేట్ వ్యక్తుల ద్వారా విక్రయిస్తున్నట్లు చెబుతుండటం గమనార్హం. గతంలో కరోనాకు ముందు బిట్రగుంట రైల్వే స్టేషన్లలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ప్యాసింజర్ రైళ్లు నిలుస్తుండేవి. దీంతో బుకింగ్ కౌంటర్ ఆదాయం రోజు వారీగా సుమారు 50 వేలు దాకా వస్తుండేది. కరోనా లాక్‌డౌన్ అనంతరం రైల్వే శాఖ అన్ని రైళ్లను పునరుద్ధరించినప్పటికీ బిట్రగుంట రైల్వే స్టేషన్లలో గతంలో నిలిచే ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్ళ హాల్టింగ్ లేకుండా చేయడంతో గణనీయంగా ఆదాయం తగ్గింది. ఇదే సాకుతో రిజర్వేషన్ కౌంటర్ ఎత్తివేసి టికెట్ల విక్రయం ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ఈ ప్రాంత ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో ఏడు రైల్వే స్టేషన్లలో టికెట్ విక్రయం ప్రైవేట్ వ్యక్తులకు దారాదత్తం చేస్తూ రైల్వే శాఖ ఉత్తర్వులు జారీ చేసినా పార్లమెంటు సభ్యులు, రాజ్యసభ సభ్యులు నోరుమెదపకపోవడం గమనార్హం. నేతలు స్పందించకపోతే క్రమేణా అభివృద్ధి సంగతి దేవుడెరుడు కానీ ఎంతో ఘనమైన దక్షిణ మధ్య రైల్వేలో ఒకప్పుడు వెలుగు వెలిగిన బిట్రగుంట కనమరుగయ్యే ప్రమాదం వుంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందిస్తారో లేదో వేచి చూడాల్సి వుంది.

## మాలేపాటి సుబ్బానాయుడు హౌస్ అరెస్ట్

**కావలి, ఆగస్టు 28 ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడుని నెల్లూరులోని ఆయన స్వగృహంలో పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు చలో మినగల్లు కార్యక్రమానికి బయలుదేరుతున్న నేపథ్యంలో పోలీసులు ఆయనను హౌస్ అరెస్ట్ చేసి బయటకు రాకుండా కట్టుదిట్టం చేశారు.

## రైలు కింద పడి వ్యక్తి మృతి

**బిట్రగుంట, ఆగస్టు 28 ప్రభాతవార్త** విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని పడుగుపాడు-కొడవలూరు రైల్వే స్టేషన్ల మధ్య అప్‌లైన్‌లో కోవూరు బ్రిడ్జి వద్ద సుమారు 50-59 సంవత్సరాల మధ్య వయసు కల్గిన గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని జిఆర్‌పి ఎస్ఐ అరుణకుమారి తెలిపారు. మృతుడు గోధుమ రంగు నిండు చేతుల చొక్కా, గ్రీన్ కలర్ లుంగీ కట్టుకొని వున్నాడని తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు కావలి రైల్వే పోలీసులకు తెలియజేయాలని ఆమె కోరారు.

## నగర పంచాయితీ నీటి సరఫరా సిబ్బందికి దుస్తులు పంపిణి



**బుచ్చి ఆగస్టు 28 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీ 13 వవార్డులో జొన్నవాడ దేవస్థాన చైర్మన్ పుట్టా లక్ష్మీ సుబ్రమణ్యంనాయుడు గృహం నందు ఆయన సతీమణి 13 వవార్డు కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ నగర పంచాయితీ నీటి సరఫరా సిబ్బందికి దుస్తులు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు బుచ్చినగరంలో పబ్లిక్ యుటిలిటి కొరకు నీటి సరఫరా అందించడంలో సిబ్బంది పనితీరు ప్రశంసనీయమని అన్నారు. నీటి సరఫరా సిబ్బందికి శ్రీమల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆశీస్సులు ఉండాలని ఆమె కాంక్షించారు.

## ఎంపీ వేమిరెడ్డికి నాయిబ్రాహ్మణుల వినతి

**నెల్లూరు సిటీ, ఆగస్టు 28, ప్రభాతవార్త** తమ సమస్యలు పరిష్కరించాలని నెల్లూరు రూరల్ పరిధిలోని కొండ్లపూడి పంచాయతీ నాయిబ్రాహ్మణ కాలనీకి చెందిన పలువురు వైసీపీ జిల్లా అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని కలిసి తమ సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా కాలనీలో తాము ఎదుర్కొంటున్న నీటి వసతి సమస్యపై వినతిపత్రం అందించారు. అనంతరం కాలనీ అధ్యక్షులు వీరరాఘవులు మాట్లాడుతూ కాలనీలో సుమారు 600 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించారన్నారు. వీరిలో అనేక మంది ఇప్పటికే ఇక్కడ నివాసం ఉంటున్నారని చెప్పారు. అయితే స్థానికంగా మంచినీటి వసతి లేకపోవడంతో దాదాపు 5 కిలోమీటర్ల మేర వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. సమీపంలోని టిడ్కో ఇళ్ల సమీపం నుంచి నీటి వసతి ఏర్పాటు చేస్తే మేలు అని ఎంపీకి విజ్ఞప్తి చేశారు. సమస్యపై సానుకూలంగా స్పందించిన ఎంపీ నగర కమీషనర్‌తో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపారు.

# గ్రాస్‌ఎన్‌రోల్‌మెంట్ రేషియో వందశాతం పూర్తి చేయాలి



**నెల్లూరు అర్బన్, ఆగస్టు 28, ప్రభాతవార్త** బడి ఈడు పిల్లల్లో ఏ ఒక్కరూ కూడా బడి బయట ఉండకూడదని, అందరూ బడికి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు గ్రాస్‌ఎన్‌రోల్‌మెంట్ రేషియో వంద శాతం పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుండి జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మున్సిపల్ కమీషనర్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమై జిల్లాలో జరుగుతున్న మన బడి, నాడు- నేడు అభివృద్ధి పనుల పురోగతి, గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో సర్వే తదితర అంశాలపై సమీక్షించి పలు ఆదేశాలు, సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతం పెంచే దిశగా సంబంధిత అధికారులు కృషి చేయాలని తెలిపారు. ఇంకనూ బడిలో చేరని, నమోదు కాని విద్యార్థులను బడిలో చేర్పించేలా ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. మున్సిపల్ కమీషనర్లు, ఎంపీడీఓల నాయకత్వంలో క్షేత్రస్థాయిలో మండల విద్యాశాఖాధికారులు అందరూ తప్పనిసరిగా ప్రతి రోజు సచివాలయాలను పర్యటించి వెల్ఫేర్ అసిస్టెంట్లు, వాలంటీర్లను సమన్వయం చేసుకుని గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో వందశాతం జరిగేలా చూడాలని ఆదేశించారు. జీఈఆర్ సర్వే పూర్తయిన తర్వాత ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారు. అందులో పదో తరగతి పాస్ అయి ఇంటర్మీడియట్ జాయిన్ కాని పిల్లలు, పాఠశాలలో, కళాశాలలో చేరిన పిల్లల వివరాలను, వలస పోయిన విద్యార్థులను గుర్తించి వారి వివరాలను సంబంధిత పాఠశాల కళాశాల యాజమాన్యాలు 100శాతం చైల్డ్ ఎన్ఫోపోర్టల్‌లో నమోదు చేయాలని అన్నారు. బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండేలా సంబంధిత అధికారులుకలసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఈ రోజుకి గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో సర్వేలో పెండింగ్‌లో ఉన్న శాతంలో 50 శాతం 29వ తేదీ సాయంత్రం నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. మండలాల వారీగా రెండో విడత మన బడి, నాడు-నేడు కింద జరుగుతున్న పనుల పురోగతిపై జిల్లాక లెక్టర్ సమీక్షిస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న మరుగుదొడ్లు, అదనపు గదుల నిర్మాణాలను, వంట గది స్లాబ్ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. అలాగే తరగతి గదుల రిపేర్లు, ఫర్నీచర్, ప్రహరి గోడలు, ఎలక్ట్రీషియన్ పనులను సకాలంలో పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, అలాగే చేసిన పనులకు సంబంధించిన ఫొటోలు కూడా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. సుమారు 12 కోట్ల రూపాయల నిధులు అందుబాటులో ఉందని, అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పనులు త్వరగా పూర్తి చేసి నిధులు ఖర్చు చేయాలని జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. ఎక్స్పెండిచర్‌ను ఇంప్రూవ్‌మెంట్ చేస్తూ రోజుకు ఒక కోటి రూపాయలు పనులు జరిగేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కలెక్టర్, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా విద్యాశాఖాధికారి గంగా భవాని, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ ఎస్‌ఈలు రంగవర ప్రసాద్, అశోక్‌కుమార్, సోషల్ వెల్ఫేర్ డీడీ రమేష్, జిల్లా ఒకేషనల్ అధికారి మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న విద్యాదీవెన పథకంతో విద్యార్థుల ఉన్నత చదువులకు భరోసా



**నెల్లూరు అర్బన్, ఆగస్టు 28, ప్రభాతవార్త** పేద కుటుంబాల్లోని విద్యార్థులందరూ ఉన్నత చదువులు చదువుకుని, ఆయా కుటుంబాలు ఆర్థికంగా పరిపుష్టి సాధించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థుల ఉన్నత చదువులకు అండగా నిలుస్తున్నారని జిల్లా పరిషత్ చైర్మన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. సోమవారం ఉదయం జగనన్న విద్యా దీవెన మూడో త్రైమాసిక నిధులు జమ కార్యక్రమాన్ని చిత్తూరు జిల్లా నగరి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించగా, నెల్లూరు జిల్లా కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్ నుంచి వర్చువల్‌గా జడ్పీచైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతి, జిల్లా స్థాయి అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. జడ్పీచైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన నవరత్నాల్లో జగనన్న విద్యా దీవెన పథకం ఎంతో ప్రధానమైందన్నారు. సమాజంలో చదువుకు పేదరికం అడ్డురాకూడదనే లక్ష్యంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫీజు రియింబర్స్‌మెంట్ పథకానికి శ్రీకారం చుట్టారని, ఈ పథకం వలన పేదరికంతో ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాల్లోని విద్యార్థులు భాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకుని ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందగలిగారని, తండ్రి స్ఫూర్తితో ముఖ్యమంత్రి జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన కార్యక్రమాలను ప్రవేశపెట్టి క్రమం తప్పకుండా నిధులు విడుదల చేస్తూ పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్నారన్నారు. జగనన్న విద్యా దీవెన పథకం కింద జిల్లాకు సంబంధించి మొత్తం 46,031 మంది విద్యార్థులకు సుమారు రూ.34.45 కోట్లను విద్యార్థుల తల్లుల ఖాతాలకు నేరుగా ముఖ్యమంత్రి జమ చేశారని ఆమె చెప్పారు. ఎక్కడా కూడా ఖర్చుకు వెనుకాడకుండా విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు చేపట్టిన ఘనత ముఖ్యమంత్రికే దక్కిందన్నారు. నాడు-నేడు, జగనన్న విద్యా కానుక, అమ్మ ఒడి, విదేశీ విద్య వంటి పథకాలతో విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి భరోసాగా నిలుస్తున్న ముఖ్యమంత్రికి విద్యార్థులు, తల్లిదండ్రులు ఆశీస్సులు అందించి అండగా నిలవాలని మంత్రి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. సోషల్ వెల్ఫేర్ డీడీ రమేష్, ట్రైబల్ వెల్ఫేర్ పీఓ డాక్టర్ మందరాణి, జిల్లా బీసీసంక్షేమాధికారి వెంకటయ్య, మైనార్టీ సంక్షేమ అధికారి నిర్మలాదేవి, హాస్టళ్ల సంక్షేమాధికారులు, వార్డెన్లు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# మహిళలు జాగ్రత్తగా ఉండాలి



**నెల్లూరు క్రైమ్, ఆగస్టు 28, ప్రభాతవార్త** నగరంలోనిఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ డాక్టర్ కే.తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో 99 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రేమ పేరుతో మహిళలను మభ్యపెట్టి పెళ్లి చేసుకుంటానని నమ్మించి వ్యక్తిగత సమాచారం, ఫొటోలు తీసుకొని వేదింపులకు గురి చేస్తూ నగదు, బంగారం కాజేసే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వివరించారు. అధిక కట్నం కోసం కట్టుకున్న భార్య, బిడ్డల బాగోగులు పట్టించుకోకుండా భర్త, అత్తింటి వారి వేదింపుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. భూ, ఆస్తి సంబంధిత, కోర్టు పరిధిలో ఉన్న వివాదాలకు సంబందించిన సున్నిత అంశాలలో న్యాయ నిపుణులు, ఉన్నతాధికారుల సలహాలు, సూచనల మేరకు చర్యలు తీసుకోవాలని, నమోదు కాబడిన సాధారణ, బలమైన గాధ, దొంగతనం, మిస్సింగ్, కిడ్నాప్ కేసులలో త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి చార్జ్ షీట్ ఫైల్ చేయాలని, నిందితులకు కఠిన శిక్షలు పడాలని ఆదేశాలు జారీ చేశారు. స్పందన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని సూచనలు అందించారు. స్పందనలో ప్రేమ పేరుతో మోసం, నమోదైన కేసులలో పురోగతి, కుటుంబ కలహాలు, భర్త అత్తారింటి వేదింపలు, భూ, ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ అనధికార చీటీలు, ఉద్యోగాలు, వృద్ధ తల్లిదండ్రులు వేదింపులు, ఇతర వివాదాలు, సమస్యలపై ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అడిషనల్ ఎస్పీ హిమవతి, ఏఎస్పీ ప్రసాద్, డీటీసీ డీఎస్పీ శిరీష, ఏఆర్ డీఎస్పీ ఎస్‌బీ సీఐ, సిబ్బంది పాల్గొన్నారు.

# ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారాలు అందించండి



**నెల్లూరు కార్పొరేషన్, ఆగస్టు 28, ప్రభాతవార్త** ప్రజా సమస్యల పరిష్కార వేదికగా జరుగుతున్న స్పందన కార్యక్రమంలో అందుకున్న విజ్ఞప్తులకు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా విచారించి, ఫిర్యాదులు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ కమీషనర్ వికాస్ మర్మత్ సూచించారు. కార్యాలయంలోని ఏపీజే అబ్దుల్ కలాం సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన స్పందన వేదికలో కమీషనర్ పాల్గొని డయల్ యువర్ కమీషనర్ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన 7ఫోన్ కాల్స్‌ను నేరుగా మాట్లాడారు. వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను కమీషనర్ సంబంధిత విభాగం అధికారులకు తెలియజేసి సూచించిన గడువులోగా నాణ్యమైన పరిష్కారం అందించాలని ఆదేశించారు. అనంతరం ప్రజల నుంచి నేరుగా 30అర్జీలను కమీషనర్ స్వీకరించారు. అందుకున్న సమస్యలకు నిర్ధిష్ట గడువులోపు పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను కమీషనర్ ఆదేశించారు. సమస్యలు పునరావృతం కాకుండా నాణ్యమైన పరిష్కారం అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ నగరంలోని రోడ్లపై పశువుల సంచారాన్ని తీవ్రంగా పరిగణలోకి తీసుకుంటున్నామని, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యలకు పశువులు ముఖ్య కారణాలుగా మారాయని తెలిపారు. నగరంలోని పశువుల యజమానులు వాటిని రోడ్లపై వదిలేయకుండా సంరక్షించుకోవాలని, లేని పక్షంలో నోటీసులు జారీ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని కమీషనర్ హెచ్చరించారు.

స్పందన వేదికలో అందించే ఫిర్యాదుల సంఖ్యను తగ్గించేందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అన్ని విభాగాల ఉన్నతాధికారులు తమ విభాగాల పనితీరును మెరుగుపరిచేందుకు ప్రత్యేక సమావేశాలు నిర్వహించుకోవాలని కమీషనర్ సూచించారు. విభాగాల ఉన్నతాధికారులు వారంలో తమకు కేటాయించిన 4 సచివాలయాలను తప్పనిసరిగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించాలని, నోటీసు బోర్డుల ద్వారా సమాచారం ప్రజలకు అందేలా పర్యవేక్షించాలని కమీషనర్ ఆదేశించారు. స్పందన వేదికలో అందుకున్న అన్ని సమస్యలకు పారదర్శకమైన పరిష్కారాన్ని, సూచించిన గడువులోపు అందించేందుకు అన్ని విభాగాల అధికారులు కృషి చేయాలని కమీషనర్ కోరారు.

## వాహన తనిఖీల్లో పట్టుబడ్డ దొంగలు

**మర్రిపాడు, ఆగస్ట్28, ప్రభాతవార్త:** మర్రిపాడు పోలీసుల అప్రమత్తతతో సుమారు నాలుగులక్షల విలువైనదొంగతనం వెలికిచూసింది. సంఘటన వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా కురసపాడు గ్రామంలో జరిగిన ఓ చోరీకి సంబంధించి ఆ నిందితులను, సొత్తును మర్రిపాడు పోలీసులు పట్టుకున్నారు. నెల్లూరు జిల్లా మర్రిపాడు పోలీసులు యధావిధిగా జాతీయరహదారిపై గస్తీ తిరుగుతుండగా ఇద్దరు వ్యక్తులు స్కూటర్‌పై వెళుతుండగా వారివద్ద ఉన్న బ్యాగులను పోలీసులు పరిశీలించగా బంగారం, వెండి, కొంత నగదు , లాప్‌టాప్ తదితరాలున్నాయి. వారిని వివరాలు అడుగగా సందేహాస్పదంగా ఉన్నందున వారిని పోలీసులు మర్రిపాడు స్టేషన్‌కు తరలించి విచారించారు. కురసపాడులో దొంగిలించిన సొత్తుతో ఆ నిందితులు తమ స్వస్థలమైన బళ్ళారికి వెళ్తూ పట్టుబడ్డారు. ఈవిషయాన్ని స్థానిక ఎస్ఐ ఆత్మకూరు సిఐ, డిఎస్‌పిలకు తెలిపారు. వారు జిల్లా ఎస్‌పికి సమాచారమిచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయం నుండి కురసపాడు పరిధి పోలీస్‌స్టేషన్‌తో సంప్రతించి అక్కడ దొంగతనం జరిగిన విషయం వాస్తవమేనని, ఇదే వస్తువులని ధృవీకరించుకున్నారు. మర్రిపాడు పోలీసులు క్రమం తప్పకుండా గస్తీ తిరగడం, అప్రమత్తంగా ఉండడంతో అ దొంగతనం విషయం బయటపడింది. దాంతో మర్రిపాడు పోలీసులను ఉన్నతాధికారులు ప్రశంసించారు. ఈ సంఘటనాసమాచారంను ఆత్మకూరు సిఐ జి.వేణు దృష్టికి తీసుకెళ్ళగా వాస్తవమేనని ఆయన ధృవీకరించారు.

## కావలి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతా

**కావలి రూరల్, ఆగస్టు 28 ప్రభాతవార్త** రానున్న ఎన్నికల్లో కావలి నియోజకవర్గం నుండి గెలుపొంది ఈ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్ది ప్రజలకు అండగా వుంటానని పసుపులేటి ఛారిటబుల్ ట్రస్ట్ (పిఎస్ఆర్) అధినేత పసుపులేటి సుధాకర్ తెలిపారు. కావలి రూరల్ మండలం రుద్రకోట గ్రామంలో సోమవారం పల్లెపల్లెకు పసుపులేటి కార్యక్రమంలో భాగంగా ఆయన పర్యటించారు. ప్రజల కష్టాలు తెలుసుకున్నారు. ఈ గ్రామంలో అధికంగా నీటి సమస్య వుందని తెలిపారు. నీటి సమస్యని తప్ప కుండా తీరుస్తానని తెలిపారు. దివ్యాంగుడు ట్రైసైకిల్ కావాలని కోరగా అందజేస్తానని హామీ ఇచ్చారు. చర్చి అభివృద్ధికి సహకరించాలని కోరగా ప్రస్తుతం తాగునీరు, విద్యుత్ దీపాలు, ఆరోగ్య సమస్యలు, విద్యకు ప్రాధాన్యత ఇచ్చి తన ట్రస్ట్ ద్వారా సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల అనంతరం చర్చిలు, గుడులు, మసీదుల అభివృద్ధికి కృషి చేస్తానని పసుపులేటి తెలిపారు. అనంతరం పసుపులేటి సు ధాకర్ మాట్లాడారు. ఈ గ్రామంలో అధికంగా నీటి సమస్య వుందని తెలిపారని తప్పకుండా ట్రస్ట్ ద్వారా నీటి వసతి కల్పిస్తానని తెలిపారు. రాజకీయ నాయకులు లాగా మాట ఇచ్చి మరిచిపోవడం జరగదని మాట ఇస్తే మరణ శాసనమేనని తెలిపారు. కావలి నియోజకవర్గ ప్రజలు నాపై చూపుతున్న అభిమానం మరు వలేనని తెలిపారు. రానున్న రోజుల్లో కావలి నియోజకవర్గానికి ఎమ్మెల్యే అవుతానని తెలిపారు. ఎటువంటి సమస్యలు లేకుండా చూసుకుంటానని తెలిపారు. అందరూ నన్ను కోరుకుంటున్నారని ఏ గ్రామానికి వెళ్లినా ఆదరించి ఆక్కున చేర్చుకుంటున్నారన్నారు. మీ అందరి దీవెనలతో ఎమ్మెల్యేగా తప్పకుండా అయి మీ సమ స్యలు తీరుస్తానన్నారు. రుద్రకోట గ్రామ ప్రజలు పసుపులేటికి ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి వెంకటేశ్వర్లు, పంది పెనుగొండయ్య గౌడ్, పిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, రుద్రకోట గ్రామ ప్రజలు అధికంగా పాల్గొన్నారు. అనంతరం చర్చిలలో ప్రార్ధనలు నిర్వహించారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**వింజమూరు, ఆగస్ట్ 28, ప్రభాతవార్త:** వింజమూరులోని శ్రీవివేకానంద జూనియర్ కళాశాలపూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం ఘనంగా నిర్వహించారు. కళాశాలకు చెందిన 2000సంవత్సరం ఇంటర్ విద్యా ర్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని కళాశాలలో నిర్వహించారు. కళాశాల విద్య పూర్తికావ డం తో వివిధ రంగాల్లో స్థిరపడిన విద్యార్థిని, విద్యార్థులు వింజమూరుకు వచ్చి కళాశాల కరస్పాండెంట్ మద్దూరు గోపాల్‌రెడ్డితో, సహచర లెక్చరర్స్‌తో గత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈసందర్భంగా కరస్పాండెంట్ గోపాల్‌రెడ్డి, లెక్చరర్స్ రాంబాబు, శ్రీనివాసమూర్తి, అరుణలు మాట్లాడుతూ పాఠశాల, కళాశాలల్లో విద్యాబోధన సమయంలో విద్యార్థులు చేసిన అల్లరితోపాటు క్రమశిక్షణతో చదువుకున్న విద్యార్థులందరు నేటికీ గుర్తిండిపోతారన్నారు. పట్టణంలో అప్పట్లో ప్రవేటు కళాశాల విద్యను ఏర్పాటుచేసి దూర ప్రాంతాలకు వెళ్ళకుండా వింజమూరులోనే ఇంటర్ చదివేందుకు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేదన్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం కోసం కృషి చేసిన విద్యార్థులందరికీ కళాశాల తరపున అభినం దనలు తెలిపారు. ఎన్నో రోజుల తర్వాత పూర్వ విద్యార్థులను కలవడం వారితో ముచ్చటించడం ఎంతో సం తోషాన్నిచ్చిందన్నారు. అనంతరం సహపంక్తిభోజనం నిర్వహించారు. ఈకార్యక్రమంలో విద్యార్థుల బృందం కోర్‌కమిటీ సభ్యులు ఆది రమేష్, గణపం మురళీకృష్ణారెడ్డి, నిమ్మకాయల పండరీనాథ్, ప్రసన్న కుమార్, వినోద్, సురేష్, కాత్యాయిని, వాణి, మురళి, సహచర విద్యార్థులు పాల్గొన్నారు.

## చింతలపాళెంలో ఉచిత వైద్యశిబిరం



**వింజమూరు, ఆగస్ట్ 28, ప్రభాతవార్త:** వింజమూరు మండలం చింతలపాళెం గ్రామంలో సోమవారం కాకర్ల చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ సంజీవిని ఆరోగ్యరథం ద్వారా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈశిబిరానికి 110మంది వివిధ అనారోగ్య సమస్యలతో ,87మంది కంటిచూపు సమస్యలతో వచ్చిన వారికి పరిక్షలు నిర్వ హించారు. వైద్యపరిక్షలు నిర్వహించిన వారికి మందులు ఉచితంగా అందజేశారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి ఆపరేషన్ ఉచితంగా నిర్వ హిస్తామన్నారు. ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలోని పేద ప్రజల సంక్షేమం, ఆరోగ్యం దృష్ట్యా కాకర్ల ట్రస్ట్ వ్యవస్థాపకుడు కాకర్ల సురేష్ అనేక కార్యక్రమాలను చేపడుతు న్నారన్నారు. వింజమూరులో 5రూపాయలకే అన్నక్యాంటీన్ ద్వారా రుచికరమైన భోజనం ప్రతి గ్రామంలో వైద్యశిబిరాలు నిర్వహించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ ఈ ప్రాంత ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు.

## టిటిడి బోర్డ్‌మెంబర్‌ను కలిసిన మాజీ ఎఫ్‌సిఐ డైరెక్టర్



**వింజమూరు, ఆగస్ట్ 28, ప్రభాతవార్త:** వింజమూరు మండల వైసిపి సీనియర్ నాయకులు, జిల్లా ఎఫ్‌సిఐ మాజీ డైరెక్టర్ అంకినపల్లి ఓబులురెడ్డి సోమవారం మాజీ మంత్రి సిద్ధారాఘవరావ్ తనయుడు, టిటిడి బోర్డ్ మెంబర్ సిద్దా సుధీర్‌బాబును కలిశారు. ఈసం దర్భంగా ఓబులురెడ్డి నల్లగొండ్ల లక్ష్మీనర్సింహస్వామి ఆలయ విశిష్టతను , ఆలయ ఉత్సవాలకు వస్తున్న భ క్తుల గురించి వివరించారు. ఇప్పటివరకు ఆలయ అబి వృద్ధి కి పాలకవర్గం చేసిన కృషిని తెలిపారు. ప్రస్తుతం ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

## త్వరితగతిన సైడు కాలువల నిర్మాణాలను పూర్తి చేయాలి



అనుమసముద్రంపేట, ఆగస్ట్ 28, ప్రభాతవార్త: ఏఎస్‌పేట లో జరుగుతున్న ఆక్రమణల తొలగింపు ప్రక్రియలో భాగంగా సోమవారం సైడు కాలువల నిర్మాణాల కోసం డిఇఇ సురేష్, ఎఇ ఖాదర్‌మస్తాన్‌లు పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి ప్రజలకు , భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఎమ్మెల్యే సూచించారని ఆమేరకు వారు కాలువ నిర్మాణం కోసం పరిశీలించారని ఈసందర్భంగా వారు తెలిపారు.

## అసైన్‌మెంట్ భూముల ఆర్డినెన్స్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి



**సైదాపురం ఆగష్టు 28 ప్రభాతవార్త** జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నూతనంగా తెచ్చిన అసైన్‌మెంట్ భూముల ఆర్డినెన్స్ సవరణ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఇప్పటి వరకు జిల్లాలో పేదలకు ఇచ్చిన అసైన్ మెంట్ భూములను భూస్వాముల నుండి తిరిగి అసైన్‌మెంట్ పొందిన లబ్దిదారులకు అప్పగించాలని అఖిలభారత రైతు కూలి సంఘం జిల్లా కన్వీనర్ డి.పి పోలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన సైదాపురంలో ఆయన విలేఖర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం అసైన్‌మెంట్ భూముల సవరణ వలన అసైన్‌మెంట్ దారుల కంటే అక్రమంగా దౌర్జనంగా అనుభవిస్తున్న భూస్వాములుకే ఎక్కువ ప్రయోజనం పొందే అవకాశం ఉందని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాలుగు సంవత్సరాల పాలనలో పేదలకు ఒక్క ఏకరా భూమి కూడా పంచలేదని అన్నారు. ఈకార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి కె రమేష్, నాయకులు వెంకటేశ్వర్లు, నవకోటి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక తవ్వకాలపై కధంతొక్కిన జనసేన



**నెల్లూరు, ఆగస్టు28 ప్రభాతవార్త- కలెక్టరేట్** జిల్లాలో అక్రమ ఇసుక తవ్వకాలు, మైనింగ్ రవాణా అంశాలపై జనసేన నాయకులు కదం తొక్కారు. ఆపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ ఆధ్వర్యంలో నగరంలోని స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌నుండి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. తొలుత ప్రభుత్వానికి వ్యతిరేఖంగా ప్లకార్డులు పట్టుకుని ధర్నాందోళన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకుని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గునుకుల కిషోర్ మాట్లాడుతు జిల్లాలో అక్రమంగా ఇసుక తవ్వకాలు, మైనింగ్ యద్దేచ్ఛగా సాగుతున్నా జిల్లా అధికారులు పట్టించుకోకపోవటం దారుణమని, ప్రణాలను పనంగా పెట్టి అన్యాయాన్ని ఎదిరించి ఇసుక రీచ్‌లలో జరుగుతున్న అన్యాయాన్ని అక్రమాన్ని వెలుగులోకి తీసుకువచ్చి అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు అందిచా చర్యలు మాత్రం శూన్యమన్నారు. పై పెచ్చు అన్యాయాన్ని ఎదిరించిన తమపై, అక్రమార్కులకు వత్తాసు పలుకుతూ స్థానిక ఎస్ఐ కేసులు పెతడామని హెచ్చరించటం దుర్మార్గమన్నారు. సుప్రీ కోర్టు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని 110 రీచ్‌లలో ఇసుక త్రవ్వకానలు నిలిపేయాల్సి ఉందని, అయినా జిల్లాలోని కొవూరు నియోజకవర్గం, బుచ్చిరెడ్డిపాలెం మండలం మినగల్లులో ఇసుక యద్దేచ్ఛగా అక్రమ రవాణా కొనసాగుతుందన్నారు. సుమారు 40 అడుగుల మేర భారీ యంత్రాలతో ఇసుకను తవ్వేశారన్నారు. ఇదే అంశంపై గతంలో స్థానికులు, పంచాయితీ అధికారులు ఇసుకాసురలను ప్రశ్నిస్తే వారిపై దాడులకు పాల్పడిన ఘటనలు ఉన్నాయన్నారు. అన్యాయాన్ని ఎదిరించిన నిలబడిన తమ పై తమ పార్టీ నాయకులపై స్థానిక పోలీసు అధికారులు అక్రమ కేసులు బనాయించటం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చఅని దుయ్యబట్టారు. వెంటనే ఆ కేసులను ఎత్తి వేయ్యాలని డిమాండ్ చేశారు. గ్రామస్థులనోళ్లు నొక్కి, అధికారుల సహకారంతో , సుప్రీం కోర్టు మాటలను పెడ చెవిన పెట్టిన వైకాపా నాయకులపై, వారికి సహకరించి తమపై కేసులు పెట్టిన అధికారులపై గ్రీన్ ట్రిబ్యునల్‌కు వెళ్లనున్నామని స్పష్టంచేశారు. గతంలో బందిపోటు దొంగలను చూస్తే ప్రజలు బయపడేవారని, ప్రస్తుతం వైపాపా నాయకులు ఆగడాలు బందిపోటు దొంగలకన్నా దారుణంగా ఉందన్నారు. మిగల్లు రీచ్‌లో తామె వెళ్లి పరిశీలించిన సందర్భంలో 30 లారీలు, 100మంది జనం, 10 జేసీబీలు ఉండగా కేవలం తాము 20 మంది కూడా లేమని అలాంటిది తాము వారిపై దౌర్జన్యం చేశామని కేసులు పెట్టడం పోలీసుల విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. ఈ అక్రమ కేసుల అంశాన్ని, సు ప్రీం కోర్టు తీర్పును పెడచెవిన పెట్టిన ప్రభత్వ తీరును ఎండగడతామని హెచ్చరించారు. తమ అదినేత పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లనున్నామన్నారు. అనంతరం ఈ మేరకు వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ హరినాయణన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సుధీర్ బద్దిపూడి, ఆత్మకూరు నియెజకవర్గ ఇన్‌చార్జ్ నళిశెట్టి శ్రీధర్, రీజనల్ కోఆర్డినేటర్ కోలా విజయలక్ష్మీ, కెఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు సుధా మాదవ్, కావలి నాయకులు పొబ్బా సాయి, వెంకట్, ఉదయగిరి నాయకులు దిలీప్, బండారు సత్యనారాయణ, షాజహాన్, ఖలీల్, బాలు, వర్షణ్, శరవణ, హేమచంద్ర, రేణుక, భవాని, అమీన్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## 2024 లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డే



**సీతారామపురం ఆగష్టు 28 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలతో ప్రతి ఇంట సంక్షేమ వెలుగులు కనిపిస్తున్నాయని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్ఆర్‌సిపి ఇంచార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అయ్యవారిపల్లి సచివాలయం పరిధిలో గల పోలంగారిపల్లి ,దేవిశెట్టిపల్లి గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. గడపగడపకు వెళ్లి సంక్షేమపథకాలను వివరించి బుక్‌లేట్‌లను లబ్దిదారులకు అందజేశారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలు ప్రజా సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతు గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం పాలనలోని వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని గతంలో టిడిపి జన్మభూమి కమీటిలను ప్రసన్నం చేసుంటేనే సంక్షేమపథకాలు అందేవని గుర్తు చేస్తు ప్రస్తుతం తమ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులందరికి పారదర్శకంగా సంక్షేమపథకాలు అందజేస్తున్న అన్నారు. గతంలో కాంటాక్ట్ ఉద్యోగులకు జీతాలు ఎక్కువగా ఇవ్వకూడదని చంద్రబాబనాయుడు హేళనగా మాట్లాడారని ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాంటాక్ట్ ఉద్యోలకు క్రమబద్ధీకరించడమే కాకుండా జీతాలు పెంచి న్యాయం చేశారని తెలిపారు. 2024లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఆయన జోస్యం చెప్పారు. మరోసారి ముఖ్యమంత్రిగా ఎన్నుకోవడానికి ప్రజలు సిద్దంగా ఉన్నారని తెలిపారు. ఎంపిపి చింతంరెడ్డి పద్మావతి, జడ్‌పిటిసి చెరుకుపల్లి రమణారెడ్డి, సొసైటీ అద్యక్షులు రామిశెట్టి తిరపతయ్య, మండల వైసిపి కన్వీనర్ చింతరెడ్డి సుబ్బారెడ్డి, వైస్ ఎంపిపి కృష్ణారెడ్డి, మండల జెసిఎస్ కన్వీనర్ బాలినేని మాబయ్య, సొసైటీ డైరక్టర్ గుండ్లపల్లి తిరిపాలు, వైసిపినాయకులు, బసిరెడ్డి తిరుమలారెడ్డి, రేనాటి రమణయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

## "రుమియన్" బుకింగ్స్‌ను ప్రారంభించిన టయోటా

**నెల్లూరు, ఆగస్టు28 ప్రభాతవార్త-విద్య** టయోటా కిర్లోస్కర్ మోటార్స్ నుండి నూతనంగా విడుదలైన రుమియన్ వామనం బుకింగ్స్‌ను నేడు ప్రారంభిచటం సంతోషంగా ఉందని టయోటా సేల్స మార్కెటింగ్ ఉపాధ్యక్షులు అతుల్‌సూద్ పేర్కొన్నారు. సోమవారం నగరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కేవలం 11 వేల రూపాలయ టోకెన్ అడ్వాన్స్‌తో వినియోగదారులు రుమియన్ వాహనాన్ని బుక్‌చేసుకోవచ్చున్నారు. ఆగస్టు ప్రధమార్ధంలో విడుదలైన ఈ వామనం ఆరుగ్రేడ్‌లలో అందుబాటులో ఉందన్నారు. రుమియన్ మోడల్స్‌ని బట్టి ఎక్స్‌ఫోరూం ధర 1029000నుండి 1368000 వరకు లబిస్తుందన్నారు. 7 సీటర్ ఎంపివిడ్రైవ్, ఐఎస్‌జి టెక్నాలజీ, ఈ-సిఎన్‌జి ని కలిగి ఉందన్నారు. అలాగే 1.5లీటర్ కె సీరిస్ పెట్రోల్ ఇంజన్‌తో లబిస్తుందన్నారు. పెట్రోల్‌లో 20.51 కిలోమీటర్లు, సిఎన్‌జిలో 26.1కిలోమీటర్ల మైలేజిని ఇస్తుందని సంస్థ ప్రకటిచంటం జరిగిందన్నారు. ఐదు గేర్ల మాన్యువల్ ట్రాన్స్‌మిషన్, స్మూత్ 6 స్పీడ్ ఆటోమొటిక్ ట్రాన్స్‌మిషన్‌తో ఈ వాహనం లబిస్తుందన్నారు. ఆటో క్లైమెడ్ కంట్రోల్, హజార్డ్‌లైట్, స్మార్ట్‌ప్లే టచ్‌స్క్రీన్ సిస్టమ్, ఎబిఎస్, ఎయిర్‌బ్యాగ్స్, ఇంజిన్ ఇమ్మొబిలైజర్, ఎలక్ట్రానిక్ స్టేబుల్ ప్రోగ్రామ్, మరెన్నో అదునాతన ఫీచర్ ఇందులో పొందుపరచటం జరిగిందన్నారు. రుమియన్‌ను బుక్‌చేసుకున్న వినియోగదారులకు సెప్టెంబర్ 28నుండి డెలివరీ ఇవ్వనున్నామని, అందరూ తమ నూతన వాహనాన్ని ఆదరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ల్యాండ్ సీడింగ్ రికార్డులను త్వరితగతిన పూర్తి చేయాలి



**తోటపల్లిగూడూరు, ఆగష్టు 28, ప్రభాతవార్త** తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం జిల్లా వ్యవసాయాధికారులు పీఎం కిసాన్ ల్యాండ్ రైతుల పొలం ఖాతాదారు నెంబరు ఆధార్ అను సంధానం పక్రియలో భాగంగా వ్యవసాయ సహాయ సంచాలకులు సుధాకర్‌రాజు నర్సోజీరావు ఇందుకూరుపేట సహాయ సంచాలకులు రాజ్‌కుమార్‌తో కలిసి తహశీల్దార్ కార్యాలయంలో అనుసంధానం పక్రియ చేపట్టారు. త్వరితగతిన పూర్తి చేయాలని తహశీల్దార్ హమీద్‌కు విజ్ఞప్తి చేశారు. వీరితో పాటు గ్రామ సహాయకులు షర్మిల, వినీల్, సుమంత్‌లు ఉన్నారు.

## వ్యక్తిత్వ వికాసం, కెరీర్‌గైడెన్స్‌పై అవగాహన అవసరం



**నెల్లూరు, ఆగస్టు28 ప్రభాతవార్త-విద్య** జిల్లా యువజన సంక్షేమశాఖ, సెంట్రల్, నెహ్రూ యువకేంద్రం, పిఎంపి అసోసియేషన్ ల సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని స్థానిక శేషు ఇంగ్లీషుమీడియం పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా జిల్లా యూత్ అధికారి డాక్టర్ ఏ.మహేందర్‌రెడ్డి మాట్లాడుతు యువత ప్రణాణికతో వారి భవిష్యత్‌ను రూపొందిచుకోవాలని, వాటి సాధనకోసం కృషిచేయ్యాలన్నారు. పిఎంపి గౌరవాధ్యక్షులు జయప్రకాష్ మాట్లాడుతు ప్రతి ఒక్కరు పాజిటివ్‌గా ఆలోచించినప్పుడే అన్నీ రంగాల్లో రాణించగలుగుతారని స్పష్టంచేశారు. కెరీర్‌గైడ్‌లైన్ ను నిర్మించుకున్న వారికి భవిష్యత్ బంగారుమయంగా ఉంటుందన్నారు. అనంతరం కెరీర్ గైడెన్స్‌కు సంబందిచిన పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బి.ఆదిశేషు, సెట్నల్ అధికారి గజాయ్ అహ్మద్, మేనేజర్ బి.శ్రీనివాసులు, దేవరకొండ శ్రీనివాసులు, ఎస్.నాగరాజు, ఎస్,మధుసూధన్‌రావు, శాఖవరపు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగువారికి ఎంపీ వేమిరెడ్డి శుభాకాంక్షలు



**నెల్లూరు సిటీ, ఆగష్టు 28, ప్రభాతవార్త** తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలకు, జిల్లా వాసులకు, భాషాభిమానులకు జిల్లా వైసీపీ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. తేనెలొలుకు పలుకు.. తెలుగులోనే సాధ్యమన్నారు. గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం జరుపుకొంటున్నామని గుర్తు చేశారు. వాడుక భాష కోసం ఆయన చేపట్టిన వ్యవహారిక భాషోద్యమ ఫలితంగానే పాంశాలల్లో, సమాచార ప్రసార సాధనాల్లో సాహిత్యంలో మాట్లాడే భాషను ఉపయోగించుకోగలుగుతున్నామని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలుగు భాషా భివృద్ధికి పెద్ద పీట వేస్తున్నారని అన్నారు. ద్విభాషా విధానంతో విద్యార్థులకు తెలుగును దగ్గర చేస్తున్నారని తెలిపారు.

## ఎంపీ వేమిరెడ్డిని కలిసిన సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ నేతలు



**నెల్లూరు సిటీ, ఆగష్టు 28, ప్రభాతవార్త** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఆయన నివాసంలో సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పందిటి సుబ్బయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరు జిల్లాలో రాజకీయంగా ఎస్సీలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్సీల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ గౌరవ అధ్యక్షులు కాకి శ్రీనివాసులు, బద్దెపూడి వెంకటరావు, పలిగిలి వెంకట రమణయ్య, తాటిపర్తి రఘురామ్, దగ్గవోలు రాజు, ఎస్‌కే రియాజ్, ఆలీ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ వేమిరెడ్డికి వైసీపీ నేతల సన్మానం



**నెల్లూరు సిటీ, ఆగష్టు 28, ప్రభాతవార్త** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఆయన నివాసంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మందల వెంకట శేషయ్య, ఇతర ముఖ్య నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. ప్రజానేత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పార్టీ జిల్లా అధ్యక్షులుగా రెండో సారి ఎన్నికవ్వడం సంతోషంగా ఉందని పార్టీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గానికి చెందిన జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఇతర ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డిని కలిసిన జడ్పీటీసీ సభ్యులు గణపం



నెల్లూరు సిటీ, ఆగష్టు 28, ప్రభాతవార్త రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని సోమవారం వింజ మూరు జడ్పీటీసీ సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభా కాంక్షలు తెలిపారు. వింజమూరు మండలాభివృద్ధికి నిధులు మంజూరు చేయించాలని కోరారు. నియో జకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతంగా ఉందని ఎప్పుడు ఎన్నికలు జరిగినా విజయం తథ్యమని తెలిపారు. మాజీ ఎఫ్‌సీఐ డైరక్టర్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంకినపల్లి ఓబుల్‌రెడ్డి, వింజమూరు సొసైటీ అధ్యక్షులు మలిరెడ్డి విజయకుమార్‌రెడ్డి, వైసీపీ యువజన నాయకులు అంకినపల్లి శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కాకాణిని కలిసిన సొసైటీ చైర్మన్



**నెల్లూరు సిటీ, ఆగష్టు 28, ప్రభాతవార్త** వింజమూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మలిరెడ్డి విజయ్‌కుమార్‌రెడ్డి జడ్పీటీసీ సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి, ఎఫ్సీఐ మాజీ డైరక్టర్ అంకెనపల్లె ఓబుల్‌రెడ్డి, అంకెనపల్లి శివశంకర్‌రెడ్డిలు సోమవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వింజమూరు సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా వ్యవసాయ మంత్రిని కలిసి సొసైటీ నిర్వహణకు రైతుల అవసరాల మేరకు సహాయ సహకారాలు అందించాల్సిందిగా మలిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

## ప్రతి కార్యకర్తను వైసిపి గుర్తిస్తుంది



**ఉదయగిరి ఆగష్టు 28ప్రభాతవార్త** ఉదయగిరి మండలంలోని షాది మంజిల్ భవనంలో నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ సిపి ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా షేక్ దస్తగిరి అహ్మద్ నియమించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వైఎస్ఆర్ సిపి ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కులమతాలకు అతీతం గా పార్టీ కోసం పనిచేసిన వారిని గుర్తించి బడుగు బలహీన వర్గాలలో నాయకులను తయారు చేసిన ఘనత ఒక్క వైసిపి కి మాత్రమే దక్కుతుందని అన్నారు. ప్రతి కార్యకర్తను వైసిపి గుర్తుపెట్టుకుంటుందని తెలిపారు. పదవి పొందిన ప్రతి కార్యకర్త నిబద్దతో పార్టీ కోసం పనిచేసే పార్టీ విజయానికి కృషి చేయాలని తెలిపారు. ఈకార్యక్రమానికి జిల్లా కో-ఆప్షన్ సభ్యులు గాజుల తాజుద్దీన్, వైసిపి నాయకులు, గాజుల షర్ఫుద్దీన్, వైసిపి కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## సొసైటీ చైర్మన్ రామిశెట్టి తిరపతయ్య కు సన్మానం

**సీతారామపురం ఆగష్టు 28 ప్రభాతవార్త** మారంరెడ్డిపల్లి పిఎసిఎస్ చైర్మన్ నూతనంగా ఎంపికైన రామిశెట్టి తిరుపతయ్యను సోమవారం సొసైటీ కార్యాలయంలో చిన్న నాగంపల్లి వైసిపి నాయకులు దుగ్గిరెడ్డి వెంకటరెడ్డి, మేరం రామయ్య, సుందరంలు కలిసి శాలువా కప్పిసన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా ఆది చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఆది నారాయణరావు, ఎస్‌టియు జిల్లా ప్రధానకార్యదర్శి అప్పన ఏడుకొండలు కలిసి సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు మండలంలోని రైతుల అబివృద్ధికి సొసైటీ ద్వారా సహాయసహాకారాలు అందించాలని సొసైటీ చైర్మన్ పదవికి వన్నె తీసుకొని రావాలని కోరారు.

## స్పందన అర్జీదారులకు భోజన పొట్లాలు పంపిణీ

**కావలి, ఆగస్టు 28 ప్రభాతవార్త** రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో కావలి ఆర్డీవో కార్యాలయంలో స్పందన అర్జీదారులకు సోమవారం భోజన పొట్లాలు, మజ్జిగ, మంచినీటి సీసాలు పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ జిల్లా పాలకమండలి సభ్యులు గంధం ప్రసన్నాంజనేయులు తన తండ్రి గంధం పిచ్చయ్య వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బాధ్యులు డాకారపు రవిప్రకాష్, మంగళగిరి వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత పాఠశాలల అభివృద్ధికి ముందుకొచ్చిన ప్రజాప్రతినిధులు, నేతలు



**బిట్రగుంట, ఆగస్టు 28 ప్రభాతవార్త** బోగోలు మండలం విశ్వనాధరావుపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ప్లస్ 2 ఉన్నత పాఠశాల ప్రాంగణాల్లో అభివృద్ధి కోసం సోమవారం ప్రజా ప్రతినిధులు, నేతలు ముందుకు వచ్చి తమ విరాళాల్ని అంద జేశారు. ఈ ఉన్నత పాఠశాలల ప్రాంగ ణాలలో కొద్దిపాటి వర్షం వస్తే నీరు నిలిచి పోయి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తీవ్ర అసౌకర్యంగా వుంటుంది. దీన్ని గమనించిన ఉన్నత పాఠశాల బాలుర, బాలికల ప్రధానోపాధ్యాయులు మండలంలోని ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంతో వైసిపి మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, జెడ్పీటీసీ మద్దిబోయిన కీర్తన, ఎంపిపి మేకల సుజాత, గ్రామ సర్పంచ్ గండూరు మంజుల, ఎంపిటిసి సభ్యులు ఎ.కె.సుందర్‌రాజ్, మద్దిబోయిన పద్మ, తదితరులు వచ్చి తమవంతు బాధ్యతగా ఆర్థిక సహాయం అందించారు. దీంతో వారం రోజుల లోగా హైస్కూల్ ప్రాంగణమంతా గ్రావెల్‌తో చదును చేసే కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని తమ ఉపాధ్యాయులు కొంత విరాళాలు అందించేందుకు ముందుకు రావడం పట్ల బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రవీంద్రనాధ్‌ఠాగూర్, గంగాధర్‌లు అందరికి కృతజ్ఞతలు తెలిపారు.

## మత్తు పదార్థాలపై అవగాహన పెంచుకోవాలి




**(కోవూరు , ఆగస్టు28 ప్రభాతవార్త :** సమాజంలో మాదకద్రవ్యాల వినియోగం వలన అనేక అనర్థాలు జరుగు తున్నాయని, అవి కుటుంబాలకు, సమాజానికి తీవ్రమైన హాని చేయడమే కాక వాటి జోలికి వెళ్లిన వారిని నేరస్తులుగా సమాజం నిలబెడుతుందని, విద్యార్థులు ఈ విషయంలో అవగాహన చేసుకోవాలని ఎస్ఈబీ సీఐ నరహరి అన్నారు. కోవూరులోని టీఎన్‌సీ కళాశాలలో సోమవారం మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ఫలితాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటు వంటి మాదకద్రవ్యాల మహమ్మారిని సమాజం నుంచి తరిమివేసే కార్యక్రమంలో విద్యార్థులు కూడా తమ వంతు పాత్ర వహించాలని పిలుపునిచ్చారు. దీనికి సంబంధించి ప్రభుత్వం టోల్‌ఫ్రీ నెంబర్ 14500 ఏర్పా టు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు వారికి తెలిసిన సమాచారాన్ని టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా తెలియజేస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారుయువత మత్తు పదార్థాల జోలికి వెళ్లి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు వారిపై పెట్టుకున్న ఆశయాలను నెరవేరుస్తూ చక్కగా చదువుకుని అభివృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. చదువు నేర్పిన విద్యాలయాలకు, అటు కన్నవారికి సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. మా దకద్రవ్యాలు కలిగి ఉన్నా.. సేవించినా , కొనినా, అమ్మినా, రవాణా చేసినా అటువంటి వాటిపై తీవ్రమైన శిక్షలు ఉంటాయన్నారు. ప్రభుత్వ వైద్యులు డాక్టర్ వెంకటాచలపతి గౌడ్ మాట్లాడుతూ ఇటువంటి మాద కద్రవ్యాల వినియోగం వలన శరీరం పూర్తిగా బలహీనపడిపోవడమే కాకుండా మత్తు జోలికి వెళ్లినప్పుడు శరీరంలోని ఏ అవయవాలు కూడా పనిచేయని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో మం డల విద్యాశాఖ అధికారి రహీమ్, సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివసులు, హెడ్ కానిస్టేబుల్ సతీష్, ఉపాధ్యాయులు పలు సూచనలు చేశారు.

## పాడి పశువుల పెంపకంపై రైతుల ప్రత్యేక దృష్టి



**(కోవూరు , ఆగస్టు28 ప్రభాతవార్త :** పాడి పశువులను పెంచే రైతులు వాటి ఆరోగ్య పరిరిక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ మౌర్య తెలిపారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పశు వైద్యశాల లో సోమవారం పాడి పశువులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులపై పాడి రైతులు పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఈ సీజన్‌లో పశు వైద్యశాలలో టీకాలు కూడా వేయడం జరుగుతుందని, ఇటువంటి అవకాశాన్ని వారు ఉపయోగించుకోవాలన్నారు. పశువుకు ఏమైనా అత్యవసర పరిస్థితి వస్తే పశు అంబులెన్స్ సేవలను వారు ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సజ్జాద్, రైతులు ఉన్నారు.

## జీవనోపాధులను మరింత పెంపొందించుకోవాలి



**కోవూరు , ఆగస్టు28 ప్రభాతవార్త :** పొదుపు గ్రూపులు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను పూర్తిస్థాయి లో సద్వినియోగం చేసుకోవడమే కాకుండా వారి జీవనోపాధులను ఘననీయంగా పెంచుకునేలా దృష్టి పెట్టా ల్సిన అవసరం ఉందని ఏపీఎం వెంకటస్వామి అన్నారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం కోవూరు మండలంలోని అన్ని పొదుపు గ్రూపుల అధ్యక్షులు, వీవోఏలతో ప్రత్యేక ఈసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా తిరిగి చెల్లించడమే కాకుండా పొదుపు గ్రూపుల యొక్క బుక్ కీపింగ్ గ్రేడింగ్‌ను మరింత పెంచుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎవరైనా మహిళలు పొదుపు సంఘాల్లో సభ్యులుగా లేని వారిని గుర్తించి వారందరినీ పొదుపు గ్రూపులో చేర్పించేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌కు సంబంధించి ఈ నెలాఖరులోగా రుణాలు మంజూరు కానున్నాయన్నారు. అదేవిధంగా పొదుపు గ్రూపులకు అవసరమైన వారికి స్త్రీనిధి రుణాలను కూడా అందించేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. పొదుపు గ్రూపులు ఎవరైనా బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుంటే ఎవరికీ కూడా రుణానికి సంబంధించి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఎవరైనా డబ్బులు కావాలని డిమాండ్ చేస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘమిత్ర అధ్యక్షురాలు సుగుణమ్మ, కార్యదర్శి ధనమ్మ, వెలుగు సీసీలు రాజశేఖర్, సౌరీ, రాము, వసంత, తదితరులు ఉన్నారు.

## వైసీపీ నేతకు దొడ్డంరెడ్డి నివాళులు



**(కోవూరు , ఆగస్టు28 ప్రభాత వార్త :** కోవూరులోని దళిత వా డకు చెందిన వైసీపీ నాయ కుడు గద్దె శీనయ్య తండ్రి గద్దె రమణయ్య సోమవారం మృతి చెందారు. ఈ మేరకు రమణ య్య పార్థివదేహానికి రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నిరంజన్‌బాబురెడ్డి పూలమాల వేసి నివాళుల ర్పిం చారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను ఓదార్చి తన సానుభూతిని తెలియజ ేశారు. ఈ కార్యక్రమంలో రైతు విభాగం అధ్యక్షుడు బి. శ్రీధర్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ అధ్యక్షుడు సుబ్బరాయుడు, తదితరులు ఉన్నారు.

## ఎంఇఒపై ఆరోపణలు చేయడం సరికాదు



**సీతారామపురం ఆగష ్టు 28 ప్రభాత వార్త** సీతారామపురం ఎంఇఒ షేక్ మ స్తాన్‌వలిపై వచ్చిన ఆరోపణలు మండల ప్లాస్టోనాయకులు తీవ్రంగా ఖండించారు. ఎంఇఒ మస్తాన్ వలికి వ్యతిరేఖంగా రెగ్యులర్ ఉదో ్యగానికి వర్కింగ్ గాడ్ అనే నినాధాన్ని పూర్తిగా నమ్మి ఆచరణ లో సాధ్య పరస్తున్న ఎంఇఒ మస్తాన్ వల్లి తన విధి నిర్వహణలో ఖచ్చితత్వం పాటిస్తారని సమయానికి తమ కార్యలయానికి చేరుకొని నిరంతరం మండలంలో ఏదో ఒక ప్రభుత్వం పాఠశాలను సందరి ్శస్తు మధ్యహ్నా బోజనాన్ని పర్యవేక్షిస్తు విద్యార్ధులకు ఉపాధ్యాయకులు సూచనలు అందరితో మమేకంగా ఉంటే పని వేళలు ముగిసే వరకు విదులను సక్రమంగా నిర్వహిస్తారని తెలిపారు. ఆయన పైన లేని పోని ఆరోపణలు చేయడం సమంజిసమం కాదని వారు ఖండించారు. ఈకార్యక్రమంలో ప్లాస్టో చైర్మన్ అప్పన ఏడుకొండలు, సినియర్‌నాయకులు ఎడమ తిరపతయ్య, పిసి కొండయ్య, ప్రసాద్, కలివెలరవి, వెంకటేశ్వర్లు ,శ్రీనివాసులు తదితరులు పాల్గోన్నారు.

## ఆదరణ కేంద్రంలో ఆహార పొట్లాలు పంపిణీ

**బిట్రగుంట, ఆగస్టు 28 ప్రభాతవార్త** బోగోలు మండలం ముంగమూరు భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆదరణ కేంద్రంలో సోమవారం కావలికి చెందిన ఇన్నర్ వీల్ క్లబ్ అనాధలకు ఆహార పొట్లాలు అందజేసింది. ఈ సందర్భంగా క్లబ్ ప్రెసిడెంట్ ఎస్.కె.రబీనా సుల్తాన్ మాట్లాడుతూ తమవంతు సహాయ సహకారాల్ని ఆదరణ కేంద్రానికి అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల మైనార్టీ నాయకులు ఎస్.కె.జహీర్, కరీం, బాషా తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా సుమన్ యువసేన ఆధ్వర్యంలో అన్నదానం



**నెల్లూరుటౌన్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** ఆల్‌ఇండియా సుమన్ యువసేన ఆధ్వ ర్యంలో ప్రముఖ హీరో సుమన్ జన్మదిన వేడుకలు పురస్కరించుకుని నగర పరిధి లోని దీనదయాల్ నగర్‌లో ఆల్‌ఇండియా సుమన్ యువసేన వ్యవస్థాపక వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ అబ్దుల్ రషీద్ ఆధ్వ ర్యంలో రిషిజైదీప్ కార్మిక ట్రస్ట్ పర్య వేక్ష ణలో సోమవారం అన్నదాన కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ రషీద్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సినీ హీరో సుమన్ జన్మదిన సందర్భంగా ప్రజలకు సేవా కార్యక్ర మాలు నిర్వహిస్తు న్నా మన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్‌ఇండియా సుమన్ యువసేన మహిళా విభాగం అధ్యక్షురాలు షేక్ ఖమ ర్తాజ్, సినీ రైటర్ పి.వి.సుకుమార్, సుమన్ యువసేన సెక్రటరీ షేక్ సుఫియా పర్వేజ్, ట్రెజరర్ నరేష్‌కు మార్, జైన్ సెక్రటరీ ప్యారి రాహిలా, దీనదయాల్ నగర్ మేస్త్రీ సుబ్రహ్మణ్యం, రహమాన్ పెద్ద సంఖ్యలో సుమన్ అభిమానులు, స్థానికులు పాల్గొన్నారు.

## వంద నాణెంపై ఎన్టీఆర్ బొమ్మ ముద్రించడం హర్షణీయం



**నెల్లూరు ఆగస్టు 28, ప్రభాతవార్త-వైద్యం** దివంగత ప్రముఖ సినీనటుడు, మాజీ ముఖ్యమంత్రి నంద మూరి తారకరామారావు బొమ్మను వంద రూపాయల నాణెంపై కేంద్ర ప్రభుత్వం ముద్రించడం హర్షించదగ్గ విషయమని తెలుగుదేశం పార్టీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు పేర్కొన్నారు. సోమ వారం నగరంలోని నర్తకిసెంటర్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి సుబ్బారావు ఎన్టీఆర్ అభిమానులు కలిసి పాలా భిషేకం చేసి, పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ము ర్ము ఎన్టీఆర్ బొమ్మని వంద రూపాయల నాణెంపై ముద్రించిన నాణెంని విడుదల చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. దానికి ఆయన కుమార్తె అయిన పురంధ్రీశ్వరి అధ్యక్షత వహించడం, ఎన్టీఆర్ కుటుంబం అంతా అక్కడకి వెళ్ళి నాణెం విడుదల కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషమన్నారు. ఇప్పటికి రామా రావు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడన్నారు. ఆయన సిని, రాజకీయ రంగాల్లో ప్రపంచ వ్యాప్తంగా తెలుగువారి ఆత్మగౌరవాన్ని చాటిన మహానుభావుడని కొనియాడారు. ఆయన 9నెలల్లోనే టీడీపీ పార్టీని స్థాపించి చరిత్ర సృష్టించారన్నారు. పేదల సంక్షేమ పథకాలు, మహిళలకు ఆస్తిలో వాటా లాంటి అనేక కార్యక్రమాలను తీసుకొచ్చి బడుగు బలహీన వర్గాల వారికి, బీసీలకు ప్రత్యేక స్థానం కల్పించా దన్నా రు. వంద రూపాయల నాణాన్ని విడు దల చేయడమే కాకుండా, నందమూరి తారక రామారావుకి భారత రత్న అవార్డును సైతం ఇవ్వాలని ప్రధాని నరేంద్ర మోదీని సుబ్బారావు కోరారు.

## అర్జీలను వెంటనే పరిష్కరించండి




**వరికుంటపాడు,ఆగస్టు 28,ప్రభాతవార్త :** జగనన్నకు చెబుదాంలో భాగంగా నిర్వహించే స్పందన గ్రీవెన్స్ కు వచ్చే అర్జీలకు ఆయా శాఖల అధికారులు వెంటనే పరిష్కారం చూపాలనీ ఎంపిడిఓ చేవూరి.శ్రీదేవి అన్నా రు.స్థానిక కార్యాలయంలో సోమవారం జగనన్నకు చెబుదాం కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్ర మములో భాగంగా ప్రజల నుండి అర్జీల స్వీకరించారు. అన్ని శాఖల అధికారులు పాల్గోన్నారు.

## వైద్యాశాలకు మట్టి కుండలు అందజేత




**వరికుంటపాడు,ఆగస్టు 28,ప్రభాతవార్త :** స్థానిక ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు నిమిత్తం వచ్చే ప్రజల దామర్తిని తీర్చేందుకు ఆంధ్రప్రదేశ్ కన్జ్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఆధ్వర్యంలో మట్టి కుండలను అందజేశారు. ఈ కార్యాక్రమములో వినియోగదారుల ఫోరం రాష్ట్ర ఈసీ మెంబర్ చల్లగాలి వెంకట మోహన్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బొడ్డు శివారెడ్డి ,మండల ఈసీ మెంబర్ వై సూర్య నారాయణ లు తమ స్వంత నిధులతో సమకూర్చిన మట్టి కుండలను వైద్యాధికారిణి కరిష్మా కు అందజేశారు. ఈ కార్యమ్రములో స్టాఫ్ నర్సులు రాజేశ్వరి, అభిలాష, హెల్త్ అసిస్టెంట్ యనమల శ్రీనివాసులు ,తదితరులు పాల్గొన్నారు.

## బోగోలులో భూ కుంభకోణాలపై న్యాయ విచారణ జరిపించాలి



కావలి, ఆగస్టు 28 ప్రభాతవార్త కావలి నియోజకవర్గంలోని బోగోలులో భూ కుంభకోణాలపై న్యాయ విచారణ జరిపిం చాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అ ధ్యక్షులు ఎస్.మల్లి డిమాండ్ చేశారు. కా వలి ఆర్డీవో కార్యాలయ ఆవరణలో గ్రామ స్తులతో కలిసి సోమవారం ధర్నా నిర్వహిం చారు. అనంతరం కావలి ఆర్డీవో శీనానా యక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లి మాట్లాడారు. బోగోలు మండలంలో తహశీల్దార్ కార్యాలయం నుంచి గంగతిప్ప ఎర్ర కండ్రిక భూములు అన్ని కూడా బినామీ పేర్ల మీద కబ్జా చేసి అమ్ముకుంటున్నది తహశీల్దార్లేనని విమర్శించారు. అప్పటి తహశీల్దార్ జయప్రకాష్ దాదాపు వంద ఎకరాలు తారుమారు చేశారన్నారు. కండ్రిక భూముల తారుమారులో కూడా తహశీల్దార్ పాత్ర ఎక్కువుగా వుందన్నారు. సర్వే నెం.542లో మూడున్నర ఎకరా లలితమ్మ తహశీల్దార్‌గా వున్న సమయంలో తన బంధువుల పేరు మీద పాసుపుస్తకాలు తీసుకొని ప్రభుత్వం భూమికి మిలటరీ అని చెప్పి యుద్ధప్రాతిపదికన పాసుపుస్తకాలు, పట్టాలు ఇచ్చి రియల్ ఎస్టేట్ వారికి 40 లక్షల రూపాయలకు అమ్ముకున్నారన్నారు. అలాగే సర్వే నెంబరు 54లో 35 ఎకరాలు బిట్రగుంట పద్మావతి పేరు మీద అడంగల్, 1బి ఇచ్చారన్నారు. 2016లో తిప్ప పోలీస్ స్టేషన్‌లో తహశీల్దార్ ప్రశాంతికుమార్‌పై కేసు కట్టారన్నారు. అలాగే ఇప్పుడు ఎర్ర కండ్రికలో 161 ఎకరాలు పది రోజుల క్రిందట కొండూరు సుహాసిని పేరు మీద ఆరు ఎకరాలు వున్నప్పటికీ ఎవరు ప్రభుత్వ భూమిని రిజిస్ట్రేషన్ చేశారో తెలియక 161 ఎకరాలను జెసిబి పెట్టి చదును చేశారన్నారు. బోగోలు మండలం మొత్తం మోపూరు జమీందారులని ఆక్రమణదారులు భూములు ఆక్రమించుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. తహశీల్దార్ కార్యాలయం నుండి కండ్రిక వరకు వున్న భూములపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ల్యాండ్ సీలింగ్‌లో పోయిన భూముల యజమానులు మరలా వారి పిల్లల పేరు మీద కోర్టులో రిట్ పిటీషన్లు వేసి భూకబ్జా చేస్తున్నారని ఆరోపించారు. దానికి రెవెన్యూ అధికారులు స్పందించలేదని తెలిపారు. దీనిలో కోట్లాది రూపాయలు లావాదేవీలు జరగడమే కాకుండా అధికార పార్టీ నాయకులు అని చెప్పి దౌర్జన్యంగా ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. వీటిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతున్నామన్నారు. ఈ కుంభకోణాలపై లోకాయుక్త, హైకోర్టును కూడా ఆశ్రయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్రం వెంకటేశ్వర్లు, చేవూరి ప్రసాద్, బ్రహ్మయ్య, మోహన్‌రావు, ఆనందం, జాషువ, కోటయ్య, ఆత్మకూరి తేజ, దళిత, గిరిజనులు పాల్గొన్నారు.

## తండ్రిని స్ఫూర్తిగా తీసుకొని సేవల్ని కొనసాగిస్తున్న గంధం ప్రసన్న



**కావలి రూరల్, ఆగస్టు 28 ప్రభాతవార్త** కావలి పట్టణం ఇందిరానగర్‌కు చెందిన మాజీ సీనియర్ కౌన్సిలర్, నెల్లూరు జిల్లా వైసిపి కార్యదర్శి గంధం ప్రసన్నాంజన ేయులు సోమవారం తన తండ్రి స్వర్గీయ గంధం పిచ్చ య్య 42వ వర్ధంతి సంద ర్భంగా సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర ఆధ్వ ర్యంలో కావలి సమీపంలోని బుడమ గుంట గిరిజన ప్రాంతంలో వంద మందికిపైగా గిరిజనులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా గంధం ప్రసన్నాంజనేయులు మాట్లాడారు. తన తండ్రి పిచ్చయ్య ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే అనేక రకాలు సేవలు చేసేవారన్నారు. తుఫాన్లు వచ్చిన సమయంలో భోజనం తయారు చేయించి ప్రజల ఆకలి తీర్చేవా రన్నారు. ఆయన స్ఫూర్తితోనే ఆయన వర్ధంతి సందర్భంగా పేదలకు అన్న దానం చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు యం.వి.ఎస్.ప్రసాదరావు, యం.అజిత్‌బాబు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సురేంద్ర, షేక్ షఫిలు పాల్గొన్నారు.

## విద్యార్థులు తెలుగుభాష ఔన్నత్యాన్ని కాపాడుకోవడానికి కృషి చేయాలి



**కావలి, ఆగస్టు 28 ప్రభాతవార్త** విద్యార్థులు తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడుకోవడానికి తమవంతు కృషి చేయాలని జవహర్ భారతి డిగ్రీ కళాశాల విశ్రాంత అధ్యాపకులు వి.చెంచ య్య తెలిపారు. కావలి జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో సోమవారం తెలుగు భాష పం డుగ వారోత్సవాల సందర్భంగా గిడుగు వెం కట రామమూర్తి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాష గిడుగు వారి కృషి అన్న అంశంపై జరిగిన కార్యక్రమానికి చెంచయ్య ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడా రు. తెలుగు భాష నానాటికి అంతరించుకొని పోతుందన్నారు. ఆనాడు గిడుగు వెంకట రామమూర్తి, గురజాడ అప్పారావు తదితరులు గ్రాంధిక భాషలో జరిగే ఉత్తరప్రత్యుత్తరాలు అధికారిక వ్యవహారాలు మొదలగు అన్నింటిని సామాన్యులకు సైతం అర్థం అయ్యేలనే ఉద్దేశంతో వ్యవహారిక భాషగా మార్చడానికి ఎన్నో విమర్శలు ఎదుర్కొని ఎంతో కృషి జరిపి సామాన్య ప్రజలకు అందుబాటులోకి వచ్చే విధంగా చేయడం జరిగింద న్నారు. అనేక సభలలో, సమావ ేశాలలో వారి వ్యవహారశైలి విమర్శలకు గురైనప్పటికీ వ్యవహారిక భాష ఆవశ్యకతని అందరికి అర్థమయ్యేలా తెలియజేసి తెలుగు భాష అంతరించిపోకుండా కాపాడారన్నారు. ప్రస్తు తం తెలుగు భాష రాయడం, మాట్లాడటం కూడా పాపం అనే విధంగా ప్రభుత్వాలు, తల్లిదండ్రులు చూస్తు న్నారన్నారు. . ఇలా అయితే మనం ఉనికిని కోల్పోతామని తెలిపారు. విద్యార్థులు తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడుకోవడానికి కృషి చేయాలని కోరారుఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.మాల్యాద్రి, డాక్టర్ జె.కృష్ణప్రసాద్‌బాబు, పి.వసంతరావు, పి.నాగేశ్వరరావు, తెలుగుభాషాశాఖాధిపతి పూరిమిట్ల నారా యణ, తాడిపర్తి హరికృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

## సమస్యల పరిస్కారానికి కృషి



**దుత్తలూరు (వరికుంటపాడు),ఆగష్టు 28,ప్రభాతవార్త :** మండలంలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్క రించేందుకు కృషి చేస్తానని దుత్తలూరు మండల పరిషత్ అధ్యక్షులు చేజర్ల జయంత్ రెడ్డి అన్నారు. సోమవారం స్థాని క మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమములో అన్ని శా ఖల పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్ లు తమ గ్రామాల్లో వీధి దీపాలను ఏర్పాటు చేయాలనీ, వీధి . దీపాలను బిగించడంలో, సరి చేయడంలో పంచాయతీలకు సచివాలయాల్లో పనిచేసే ఎనర్జీ అసిస్టెంట్ లు సహాకరించడం లేదనీ వాపోయారు. అలాగే తెడ్డుపాడు సర్పంచ్ మాట్లాడుతూ తమ గ్రామంలో తనకు తెలియకుండానే పనులను చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా పలువూరు సర్పంచ్ లు తెలిపిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని, అలాగే మండలంలో పని చేసే గ్రీన్ అంబాసిడర్స్ జీతాలు, జగనన్న లే అవుట్ల లో స్థలాలు ఇవ్వని వారికి త్వరితి గతిన స్థలాలు ఇప్పించడం, గృహాలు మంజూరు చేయించడం వంటి ,అంగన్‌వాడీ స్కూల్ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరలో జరగబోవు జిల్లా పరిషత్ సమావేశంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసు కువెళ్తానని ఎంపీపీ చేజర్ల జయంత్ రెడ్డి తెలిపారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా మండల అభివృద్ధి కి అందరం కృషి చేయాలన్నారు. ఈ సర్వసభ్య సమావేశానికి కొన్ని శాఖల అదికారులు డుమ్మాకొట్టడం విశేషం ఈ కార్యక్రమములో ఎంపిడిఓ సాయి ప్రసాద్ ,తహశీల్ధార్ సోమ్లా నాయక్ ,ఎఈ పిఆర్ రవీంద్రనాధ్, ఎఈ ఆర్‌డబ్ల్యుఎస్ హరిత, ఈఓపిఆర్‌డి మురళిమోహన్‌రెడ్డి, వైద్యాధికారి ఆయూబ్ అప్స ర్, ఎపిఓ బ్రహ్మయ్య, సర్పంచ్ లు ,ఎంపిటిసి సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలి




**కావలి రూరల్, ఆగస్టు 28 ప్రభాతవార్త** యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని కావలి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సుశీల్‌కుమార్ ప్రియ తెలిపారు. కావలి రూరల్ మండలం రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం టీం సేవియర్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన అవగాహన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. విద్యార్థి దశలోనే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న టీం సేవియర్స్ నిర్వాహకులు ఆదర్శప్రాయులని తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు సైతం సేవా కార్యక్రమలలో ముందుంటారన్నారు. టీం సేవియర్స్ మహిళా విభాగం కన్వీనర్ కీర్తిప్రియ విద్యార్థులకు రక్తదానంపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండి ఆరోగ్యంగా వున్న వారందరూ రక్తదానానికి అర్హులేనని తెలిపారు. 15 మంది విద్యార్థిని, విద్యా ర్థులు, సిబ్బంది, గ్రామ యువకులు రక్తదానం చేశారు. 100 మందికి రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వ హించారు. ఈ కార్యక్ర మంలో రెడ్‌క్రాస్ యోగా కేంద్రం కన్వీనర్ కె.హరినారపరెడ్డి, జూనియర్ రెడ్‌క్రాస్ కన్వీనర్ ఎ.వి.హనుమ కుమార్, అధ్యాపకులు శివకుమార్, టీం సేవియర్స్ సభ్యులు రమణ, సుందర్, ప్రేక్ష, మణికంఠ, శుశాల్ తదితరులు పాల్గొన్నారు.

## అన్యమతస్తులను దేవాలయాల పాలకమండలి సభ్యులుగా నియమించడం దారుణం




**కావలి, ఆగస్టు 28 ప్రభాతవార్త** అన్యమతస్తులను హిందూ దేవాలయాల పాలకమండలి సభ్యులుగా నియ మించడం దారుణమని బిజెపి నేతలు తెలిపారు. హిందూ దేవాలయాల పాలకమండలిలో అన్యమతస్తులను, నిందితులను నియమించడాన్ని నిరసిస్తూ బిజెపి కావలి పట్టణ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కావలి పట్టణం పాతవూరులోని శివాలయం వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు కుట్టుబోయిన బ్రహ్మానందం మాట్లాడారు. హిందూ దేవాలయాల పాలకమండలిలో అన్య మతస్తులను, నిందితులను నియమించడాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి ఆదేశాలతో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలిలో హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహా రిస్తుందని దుయ్యబట్టారు. హిందూ దేవాలయాలను రాజకీయ పునరావాస కేంద్రాలుగా రాష్ట్ర ప్రభుత్వం మార్చుకుంటుందన్నారు. టిటిడిలో ఇటీవల నియమించిన పాలకమండలిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హైందవ ధర్మాన్ని పాటించే వారిని పాలకమండలి సభ్యులుగా నియమించాలన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం దేవుని మీద విశ్వాసం వున్న హిందువులను మాత్రమే పాలకమండలిలో సభ్యులుగా నియమించాలని డిమాండ్ చేశరు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ అసెంబ్లీ కన్వీనర్ సి.వి. సి.సత్యం, బిజెపి నాయకులు మంద కిరణ్‌కుమార్, లక్కరాజు భాస్కర్, పరుసు వెంకటేశ్వర్లు, మందా శ్రీని వాసులు, కుట్టుబోయిన మాధవరావు యాదవ్, కామినేని ఉదయలక్ష్మి, తుమాటి తిరుపతిస్వామి, కూరాకుల సవింద్ర, కటకం మనోజ్‌కుమార్, పసుపులేటి సుధాకర్, దేవళ్ళ రాకేష్, షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

## మినగల్లు ఇసుకరీచ్‌లో ఉద్రిక్తత ..దినేష్‌రెడ్డిని అడ్డుకున్న పోలీసులు





**బుచ్చి ఆగష్టు 28 ప్రభాతవార్త** మినగల్లు ఇసుక రీచ్ వద్ద సోమవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. టిడిపి నాయకులు ఇసుక రీచ్‌కి వెళ్లేందుకు ప్రయత్నించగా ఎస్ఐ వీరప్రతాప్ అడ్డుకున్నారు. అలాగే నెల్లూరు టౌన్‌లో టిడిపి నాయకుల్ని హౌస్ అరెస్టు చేయడం తెలుసుకున్న కోవూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి వాహనాలు మారుస్తు పోలీసుల కళ్ళుకప్పి కొత్త మినగల్లు పైరోడ్డు లో టిడిపి నాయకుడి మోటార్‌బైకుపైన పెన్నానదిలో ఇసుక రీచ్ వద్దకు చేరుకొని ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న సిఐ రామకృష్ణారెడ్డి,సిఐ రామారావు,ఎస్ఐ రంగనాద్‌గౌడ్,ఎస్ఐ వీరప్రతాప్ తమ సిబ్బందితో ఇసుక రీచ్ వద్దకు చేరుకొని పోలంరెడ్డి దినేష్‌రెడ్డి చేస్తున్న ఆందోళన కార్యక్రమాన్ని నిలువరించారు.దీంతో పోలీసులకు టిడిపి నేతల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది.ఈ విషయమై పోలంరెడ్డి దినేష్‌రెడ్డి మాట్లాడుతు ఇది ప్రజాసా మ్యమా ! నియంత్రుత్వమా ! అని మండిపడ్డారు . ప్రతిపక్షనేతలు ఇసుక రీచ్‌లు చూడకూడదా అని ఆయన ప్రశ్నించారు.మినగల్లు ఇసుకరీచ్‌కి అనుమతులు లేక పోయినా ఎన్ఎస్ పురం పేరుమీద వే బిల్లు ఇస్తున్నారని ఇటువంటివి అధికారులకు పోలీసులకు కనబడవా అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇసుక రీచ్‌లన్ని సుప్రీం కోర్టు నిలిపివేయమని ఆదేశాలు ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కనుసన్నలలో ఈరీచ్‌ల నిర్వహణ జరుగుతుంని అన్నారు. మినగల్లు ఇసుక రీచ్ కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కనుసన్నలలో జరుగుతుందని ఆయన ఆరోపించారు. ఇసుకరీచ్‌లు చూడడానికి మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి,కోటంరెడ్డి శ్రీదర్‌రెడ్డి, నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మినగల్లుకు వస్తుంటే వారిని హౌస్ అరెస్టు చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. పోలీసులు ఎంత వారించినా టిడిపినాయకులు యంత్రాలకు అడ్డుగా వుండడంతో పోలీసులకు టిడిపి శ్రేణులకు మధ్య ఉక్తి వాతావరణం నెలకొంది. పోలీసులు బలవంతంగా దినేష్‌రెడ్డిని, చెముకుల కృష్ణ చైతన్యని,బత్తల హరికృష్ణాను పోలీస్ వాహనాలలో ఎక్కించుకొని తీసుకొని వెళుతుండడంతో మినగల్లు గ్రామంలో టిడిపి నాయకులు పోలీసు వాహనాలను అడ్డుకున్నారు. దీంతో పోలీసులు దినేష్‌రెడ్డి బేషరుత్తుగా విడిచిపెట్టారు.ఈకార్యక్రమంలో కోవూ రు, ఇందుకూరుపేట,కొడవలూరు నాయకులు,జిల్లా రైతు విభాగం నాయకులు జిల్లా అధికార ప్రతినిది చెముకుల కృష్ణ చైతన్య, నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి, మండల పార్టీ అద్యక్షులు ఎం.వి శేషయ్య, బత్తల హరికృష్ణా, తాళ్ళ నరసింహస్వామి జొన్నవాడ సర్పంచ్ పెంచలయ్య,మినగల్లు నాయకులు సురేష్‌రెడ్డి,దొడ్ల కోదండరామిరెడ్డి ,బండ్ల కొండయ్య,వల్లూరు శ్రీనివాసులు,మైనార్టీనాయకులు సర్దార్, పెనుబల్లి మల్లారెడ్డి,పలువురు టిడిపినాయకులు,కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## వైకాపా పాలనపై ప్రజల నుండి వ్యతిరేకత



**తోటపల్లిగూడూరు, ఆగష్టు 28, ప్రభాతవార్త** వైకాపా పాలనను ప్రజలు వ్యతిరేకిస్తున్నారని తిరుపతి మాజీ పార్లమెంటు సభ్యులు చింతా మోహన్ పేర్కొన్నారు. మండలంలో కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ చింతా మోహన్ సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికి వైకాపా ప్రభుత్వ అసమర్ధ పాలనపై వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2.30 లక్షల కోట్లు ఖర్చు పెట్టామని చెబుతున్నారని అదే విధంగా తిరుమల తిరుపతి దేవస్థానం నిధులు రూ.17వేల కోట్లు ఎక్కడ ఖర్చు పెట్టారో ప్రజలకు వివరించాలని, ముఖ్యమంత్రి సూటిగా ఈ రెండు ప్రశ్నలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నిధులను సక్రమంగా వినియోగించి ఉంటే అన్ని నియోజకవర్గాలు రూ.10వేల కోట్లతో అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది ఉద్యోగ అవకాశాలు లభించి ఉండేవని తెలిపారు. బీజేపీ వైసీపీ పాలనలో ధరలు పెరిగి నిరుపేదల అప్పులు పెరిగి నిరుద్యోగంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణం నిరుపేదల అప్పులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతరిక్ష పరీక్షలు దాదాపు 50 సంవత్సరాల క్రితమే జవహర్లాల్ నెహ్రు ఇందిరా గాంధీ హయాంలో శాస్త్ర విజ్ఞానం పెరిగి చంద్రునిపై కాలు మోపడం జరిగిందన్నారు. కానీ ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం ఈ ఘనత తనదిగా చెప్పుకుంటున్నారని ఎద్దేవ చేశారు. అందరం సమైక్యంగా కలిసి కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గకాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి పూల చంద్రశేఖర్, ఎస్సీ సెల్ విభాగం నేతలు నాగరాజు, అంకయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోవెరపాలెంలో ప్రారంభమైన రీసర్వే



**తోటపల్లిగూడూరు, ఆగష్టు 28 ,ప్రభాతవార్త** మండలంలోని కోవెరపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో సోమవారం జగనన్న భూ హక్కు భూసర్వే అనే రైతుల రీ సర్వే కార్యక్రమం స్థానిక సర్పంచ్ తలమంచి సురేంద్రబాబు ప్రారంభించారు. ఇందులో భాగంగా మొట్టమొదటగా ప్రముఖ వైద్యులు డాక్టర్ శేషయ్య ఎంఎస్ జనరల్ సర్జన్ గుంటూరు వారి పొలంలో ప్రారంభించారు. ఈ సర్వే పూర్వం బ్రిటీష్ కాలం నాటి నుండి సుమారుగా 100 సంవత్సరాల తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు ఎంతో లాభదాయకమైన ఈ సర్వే నిర్వహిస్తున్నారని రైతులు ఎంతగానో ఆనందపడుతున్నారు.

## కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి గృహనిర్బంధం

**నెల్లూరు ఆగష్టు 28, ప్రభాతవార్త-వైద్యం** తెలుగుదేశం పార్టీ చేపట్టిన ఛలో మినగల్లు కార్యక్రమానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో నెల్లూరు నగరంలోని చిల్డ్రన్స్‌పార్కు సమీపంలో ఉన్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని పోలీసులు సోమవారం ఆయన గృహంలోనే నిర్బంధించారు. శ్రీనివాసులురెడ్డి బయటకు రాకుండా ఆయన ఇంటిని పోలీసులు చుట్టుముట్టడంతో శ్రీనివాసులురెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నేతలు ప్రకృతి సంపదలు దోచుకుంటున్నారని దాన్ని ప్రశ్నించేందుకు వెళ్తుంటే పోలీసులు అడ్డుకోవడం దారుణమన్నారు. వైసీపీ నేతలకు అడ్డు అదుపు లేకుండా ఇసుకను అక్రమ రవాణా చేస్తూ భారీ అవినీతికి పాల్పడుతున్నారని, మినగల్లు నుండి వేలాదిగా ట్రాక్టర్లలో పక్క రాష్ట్రాలకు ఇసుకను తరలిస్తున్నారని ఆరోపించారు. అధికారం చేతిలో ఉందని వైసీపీ నేతలు రెచ్చిపోతున్నారని, వారి అవినీతి మీద పోరాటం చేసేందుకు తాము ఎప్పుడు ముందుంటామన్నారు. పోలీసుల ఓవర్ యాక్షన్ ఎక్కువైందన్నారు. తాము అధికారంలోకి రాగానే అవినీతి అధికారులపై విచారణ చేపడతామని శ్రీనివాసులురెడ్డి హెచ్చరించారు.

## టిప్పర్, మోటార్ సైకిల్ ఢీ






**(కోవూరు , ఆగస్టు28 ప్రభాతవార్త :** కూలీ నాలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారి కుటుంబంలో రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. దగదర్తి మండలం బోడగుడిపాడు గ్రామానికి చెందిన బుట్టా రమేష్-సునీత దంపతులు సోమవారం నెల్లూరుకు మోటార్ సైకిల్ మీద వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా కోవూరులోని ఇనమడుగు సెంటర్ ప్రాంతంలో అదేవైపు ప్రయాణిస్తున్న టిప్పర్ వేగం గా ఢీకొంది. ఈ సందర్భంగా మోటార్ సైకిల్ ను ఢీకొన్న టిప్పర్ బైక్‌ను కొంతదూరం ఈడ్చుకు వెళ్లింది. ఈ సంఘటనలో సునీత(25) అక్కడికక్కడే మృతిచెందగా రమేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన రమేష్‌ను 108 అంబులెన్స్ ద్వారా నెల్లూరుకు తరలించారు. ఈ మేరకు ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## రేషన్ కాటాల తనిఖీలు



**(కోవూరు , ఆగస్టు28 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీపార్కు సెంటర్ ప్రాంతంలో సోమవారం కోవూరు మండలంలోని 47 రేషన్ షాపులకు సంబంధించి రేషన్ షాపుల్లోని కాటాలకు సీల్‌లు, తూకం సక్రమంగా ఉందా లేదా అనే విషయాలను తూనికలు కొలతలు ఇన్‌స్పెక్టర్ సాయి శ్రీకర్ ఆధ్వర్యంలో నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 47 రేషన్ సానులు ఉండగా 30 రేషన్ షాపుల వారు మాత్రమే తమ కాటాలు తీసుకువచ్చి సీల్‌లు వసేకున్నారని, మిగిలిన వారు రాలేదన్నారు. కాటాలు తీసుకురాని రేషన్ డీలర్లపై కాటాలు పరిశీలించి కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.

## డిగ్రీ ఫలితాల్లో యూనివర్శిటీ టాపర్లుగా కృష్ణచైతన్య విద్యార్థులు



**నెల్లూరు,ఆగస్టు28 ప్రభాతవార్త-విద్య** విక్రమసింహపురి యూనివర్శిటీ విడుదల చేసిన డిగ్రీ 5వ సెమిష్టర్ ఫలితాల్లో నగరంలోని స్థానిక కృష్ణచైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థులు అన్నీ విభాగాల్లో, అన్నీ గ్రూపుల్లో ప్రథమర్యాంకులు సాదించి విజయ ధుందిబి మోగించారు. బిఎస్సీ విభాగంలో షేక్.దులీషా 99.8శాతం తో యూనివర్శిటీ ప్రథమస్థానికి కైవశం చేసుకుంది. ఎ.సుష్మ, ఎస్‌డి.అన్‌జుమ్‌ఫైఫాలు 99.5శాతం, పి.సుజిత 99.2శాతం, ఎ.భార్గవి 99శాతం, ఎ.పూజిత, పి.రీతికా, ఎస్.మౌనిక, షేక్.మనీషాలు 98.5శాతం మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించారు. బిసిఏ విభాగంలో కె.ధరణి ఉషా, కె.రాజా మౌనిషాలు 98శాతంతో యూనివర్శిటీ ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నారు. అలాగే ఎస్‌డి.రుబీనా, జి.జాహ్నవిలు 97శాతంతో ద్వితీయ స్థానాన్ని, ఎం.ప్రవల్లిక, సిహెచ్.సాయిసూర్య, పి.ప్రసన్న, కె.మౌనిక, పి.మాసనా, సిహెచ్.వనీతబాయి, ఎన్.నిత్యశ్రీ, డి.సాయిబిందు 96శాతంతో తృతీయ స్థానాన్ని దక్కించుకున్నారు. బిఎస్సీ లైఫ్‌సైన్స్ విభాగంలో కె.లక్ష్మీ ప్రసన్న 98శాతం తో యూనివర్శిటీ ప్రథమస్థానాన్ని సాధించింది. ఎస్‌కె.షహనాజ్, పి.లావణ్య, కెవినయ్‌కుమార్‌లు 97శాతంతో ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నారు. బిబిఏ విభాగంలో జి.మౌనిక 94శాతంతో యూనివర్శిటీ టాపర్‌గా నిలిచి సత్తా చాటింది. ఎం.శ్రీలేఖ్య 93శాతంతో ద్వితీయ స్థానం, కె.సోని, ఎన్.హర్షిత లు 92శాతంతో తృతీయస్థానం దకి ్కంచుకున్నారు. బికాంలో ఎ.రాధారాణి 94 శాతంతో యూనివర్శిటీ టాపర్‌గా నిలిచింది. ఎన్.ప్రసన్న, ఆర్.ఆరుణ, బి.లలిత, జి.చందనప్రియ లు 93 శాతంతో ద్వితీయస్థానాన్ని దక్కించుకుని విజయడంకా మెగించారు. ఈసందర్భంగా స్థానిక కళాశాలలో ర్యాంకర్లకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యాసంస్థల డైరెక్టర్లు ఆర్‌వి.కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్‌లు ఈ సందర్భంగా మాట్లాడుతు 5మంది విద్యార్థులకు 99కి పైగా మార్కులు, 17మంది విద్యార్థులకు 98శాతంకుపైగా మార్కులు రావటం జరిగిందన్నారు. 102మందికి 95శాతం కంటే ఎక్కువగా, 358మందికి 90శాతం కంటే అధిక మార్కులు రావటం సంతోష దాయకమన్నారు. తమ విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడలు, సేవా కార్యక్రమాల్లో కూడా ఉత్తమంగా నిలవటం గర్వకారణమన్నారు. అనంతరం ర్యాంకర్లకు పుష్పగుచ్చాలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బి.సుధారాణి, అడ్మిన్‌డీన్ రామాంజనేయులురెడ్డి, ప్రిన్సిపాల్ నాగయ్య, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరు వాసికి బంగారు నంది అవార్డు అందజేత



**అల్లూరు, ఆగస్టు 28 ప్రభాతవార్త** అల్లూ రు రామకృష్ణా విద్యాసంస్థలలో పనిచే సిన విశ్రాంత సంస్కృత ఉపాధ్యాయులు కితాంబి వీరరాఘవన్‌కు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో బంగారు నంది అవార్డును హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా అంద జేశారు. శ్రీ మంజునాథ ఫౌండేషన్ వ్యవ స్థాపక అధ్యక్షులు కీసర మంజుల గౌడ్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ద్వితీయ వార్షికోత్సవంలో ప్రతిభా బంగారు నంది అవార్డు -2023 సంవత్సరానికి గాను ప్రముఖ ఆధ్యాత్మికవేత్తగా అల్లూరు వాస్త వ్యుడు కితాంబి వీరరాఘవన్ గవర్నర్ చేతుల మీదుగా బంగారు నంది అవార్డు అందుకోవడంసంతోషంగా వుందని అల్లూ రు ప్రజలు, రామకృష్ణ విద్యా సంస్థల ఉపాధ్యాయులు తెలిపారు.

## ఘనంగా సీతారాముల ఉత్సవాలు



**దుత్తలూరు(వరికుంటపాడు), ఆగష్టు 28,ప్రభాతవార్త** : తెడ్డుపాడు గ్రామంలో ఉన్న సీతారాముల ఆలయంలో ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ ఉత్సవాలలో భాగంగా సీతారాముల వారి కళ్యాణాన్ని కన్నుల విందుగా,వేద మంత్రోచ్చరణల మధ్య మేళ తాళాల నడుమ ఘనంగా నిర్వహించారు.రాములోరి కళ్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు తరలివచ్చారు.అనంతరం రాత్రికి ప్రత్యేక అలంకరణలో సీతారాముల గ్రామోత్సవం తప్పెట ్ల,భాణా సంచా మోతల మధ్య వైభవంగా నిర్వహించారు.గ్రామములో జరిగిన గ్రామోత్సవంలో భక్తులు కాయాకర్పురం అందజేసి ,మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమాన్ని పచ్చవ వెంకటరత్నం కుటుంబ సభ్యులు ఉభయకర్తలు గా వ్యవహరించారు.

## కేసులకు భయపడేది లేదు



**నెల్లూరు ఆగస్టు 28, ప్రభాతవార్త-వైద్యం** కావాలనే మాపై కేసులు పెడతామంటే భయపడి వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే, రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి హెచ్చరించారు. సోమవారం ఛలో మినగల్లు కార్యక్రమం నేపథ్యంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి, గిరిధర్‌రెడ్డిలను మినగల్లు ఇసుకరీచ్‌కు వెళ్ళకుండా రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు రూరల్ కార్యాలయం నుండి బయటకు వెళ్ళకుండా కార్యాలయాన్ని చుట్టుముట్టారు. ఈ సందర్భంగా కాసేపు పోలీసులకు ఎమ్మెల్యేకి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నాయకులు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం ముందు బైఠాయించి పోలీసు జులుం నశించాలంటూ నినాదాలు చేశారు. మొదట కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఇంటిలోనే శ్రీధర్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేయాలని నిర్ణయించుకున్న పోలీసులు మాగుంట లేఅవుట్‌లో ఉన్న శ్రీధర్‌రెడ్డికి ఇంటిని చుట్టుముట్టారు. అక్కడ నుంచి శ్రీధర్‌రెడ్డి వారి కళ్ళు కప్పి వేరు ద్వారం గుండా తప్పించుకుని రూరల్ ఎమ్మెల్యే కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ పోలీసుల చేత అక్రమకేసులు, అక్రమ అరెస్టులు చేస్తామంటూ ప్రభుత్వం బెదిరిస్తే అదరేది, బెదిరేది లేదంటూ కోటంరెడ్డి అన్నారు. భయపెడుతూ ప్రజా ఉద్యమాలను అపలేరన్నారు. లాఠీ, తూటాలు ప్రయోగిస్తే రెట్టించిన ఉత్సాహంతో మరింతగా పార్టీ, ప్రజల కోసం పోరాడతామన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబునాయుడు ఇసుక ధరను గతంలో లాగా అతి తక్కువ ధరకే ఇసుకను ప్రజలకు అందిస్తారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇసుక ధరను ఇష్టానుసారంగా పెంచి, 4రెట్లు, 5రెట్లు చేసిందన్నారు. ఒకలోడు ఇసుకకు రూ.6వేలు వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఆ ధనం ఎక్కడికి పోతున్నాయో ప్రజలకు తెలపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వేలాది కోట్ల రూపాయల ఇసుక దోపిడిని ప్రశ్నిస్తూ సుప్రీమ్‌కోర్టు తీర్పు ఇచ్చినా, కోర్టు తీర్పును కూడా లెక్కచేయకుండా ఇష్టారాజ్యంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. న్యాయ పోరాటాలను చేస్తున్న సమయంలో ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా పోలీసులు అరెస్టులు పాల్పడడం సరికాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు జన్ని రమణయ్య, దొడ్డపనేని రాజానాయుడు, జిల్లా అధికార ప్రతినిధి పఠాన్ సాబిర్‌ఖాన్, టి వెంకటేశ్వర్లు, బి మురహరి, సీహెచ్ మహేష్, బి నరసింహగిరి, క్లస్టర్ ఇన్‌చార్జ్ ఎం పెంచలనాయుడు, కనపర్తి గంగాధర్, ఎం రఘు, సారంగం గున్నయ్య, షంషుద్దీన్, నెల్లూరు మురళినాయుడు, మదన్‌కుమార్‌రెడ్డి, ఏవిజయ్, సురేంద్ర, యానాదిరెడ్డి, యోగానందం, కోటిరెడ్డి, వెంకటసుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

## 97 వేల 5 వందల గడపలు తిరిగాం : ఎమ్మెల్యే



**బుచ్చి ఆగష్టు 28 ప్రభాతవార్త** గడగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో బాగంగా ఇప్పటి వరకు 97 వేల 5 వందల గడపలు తిరగడం జరిగిందని ఆయన తెలిపారు.బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని వవ్వేరు గ్రామంలో ఆర్‌బికె భవనం ప్రారంభం, వవ్వేరు నుండి బుచ్చి వరకు తారురోడ్డు నిర్మాణానికి ఎఎంసి నిధుల నుండి జగన్‌మోహన్‌రెడ్డి 80 లక్షల రూపాయాలతో ఈరోడ్డు మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. ఈ రోడ్డు నిర్మాణానికి శంకుస్ధాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతు ఆగష్టు 1 నుండి జొన్నవాడ మల్లికార్జునస్వామి ,కామాక్షితాయి ఆశీస్సులతో గడగడపకు కార్యక్రమాన్ని ప్రారంభి ంచడం జరిగిందని నియో జకవర్గంలో ఈ కార్యక్రమం ద్విగిజయంగా జరుగుతుందని తెలిపారు.ఎక్కడికి వెళ్లినా ప్రజలు విశేషంగా ఆదరిస్తున్నారని అన్నారు. కోవూరు నియోజకవర్గంలో కొత్తగా 858 కొత్త పెన్షన్లు మంజూరు చేయడం జరిగిందని చెప్పారు.బుచ్చిరెడ్డిపాలెం రూరల్‌లో 100 పెన్షన్లు,బుచ్చిరెడ్డిపాలెం టౌన్‌లో122 మంజూరు చేసినట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎంతోమంది ముఖ్యమంత్రులు పనిచేశారు కాని ఇంత పెద్ద ఎత్తున సంక్షేమపథకాలు ప్రవేశపెట్టి న వారు ఎవ ్వరు లేరని ఆయన పేర్కొన్నారు.చంద్రబాబునాయుడు హయాంలో 34 లక్షల మందికి పెన్షన్లు ఇస్తే 64 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు.ఎవ్వరు ఎన్ని వేషాలు వేసినా చంద్రబాబునాయుడ్ని,పవన్ కళ్యాణ్‌ని ఎవ్వరు నమ్మరని మరలా రాబోయే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ఆయన స్పష్టం చేశారు. పవన్ కళ్యాణ్ వ్యాను ఎక్కి తిట్టడం తప్పు చేసింది ఏమిలే దని అన్నారు. అనంతరం మండల వైస్ చైర్‌పర్సన్ కోటంరెడ్డి లలితారెడ్డి మాట్లాడుతు వవ్వేరుకి ఎన్నో సంవత్సరాలు కలగా మిగిలిపోయిన ఆర్అండ్‌బి రోడ్డు నిర్మాణానికి 80 లక్షలు మంజూరు చేయడం,ఆర్‌బికె భవనం, మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణం ఇలా అనేక అభివృద్ది కార్యక్రమాలు మంజూరు చేస్తున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి ఆమె ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

### వాలింటర్లను,సచివాలయ సిబ్బందిని అబినందించిన ఎమ్మెల్యే

వవ్వేరులో వాలింటర్లు,సచివాలయ సిబ్బంది బాగా పనిచేస్తున్నారని వారిని అభినందించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి వాలింటర్లు,సచివాలయం సిబ్బంది ఇద్దరు రెండు కళ్ళు అని ఆయన స్పష్టం చేశారు. ఇదేస్పూర్తితో ముందుకు వెళ్లాలని అన్నారు.ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయ మండల చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి ,అగ్రికల్చర్ జెడి సుధాకర్‌రాజు, ఎడిఎ డి .సుజాత, చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, మోర్ల మురళీ,జొన్నవాడ దేవస్ధానం చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు,కౌన్సిలర్లు పుట్టా లక్ష్మీకాంతమ్మ, షేక్ షకిలాబేగం, కంతా అనంతమ్మ,కో ఆప్షన్ మెంబర్ షేర్ ఇర్షాద్, టౌన్ అద్యక్షులు టంగుటూరు మల్లికార్జునరెడ్డి, నగర అద్యక్షులు చెర్లో సతీష్‌రెడ్డి,ఎపిఎం లలితారెడ్డి, అగ్రికల్చర్ ఏఇ సురేంద్ర, కౌన్సిలర్ శివకుమార్‌రెడ్డి, డాక్టర్ అల్లాబక్షు, మోర్ల భరత్‌కుమార్,మోర్ల జయంతి ,కౌన్సిలర్ రాచూరు సత్యనారాయణ, శ్రీకాంత్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, మురళీ, పలువురు వైసిపినాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోగుల పట్ల నిర్లక్ష్య వైఖరి తగదు



**పొదలకూరు ఆగష్టు 28 ప్రభాతవార్త** వివిధ రుగ్మతలతో పరిక్షలు చికిత్సల కోసం వచ్చే రోగుల పట్ల డాక్టర్లకి ,వైద్యసిబ్బందికి నిర్లక్ష్యం తగదని ప్రేమ, అదరాభిమానులతో రోగికి ధైర్యం చెప్పాలని పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రం డ్రాయింగ్ అధికారి ప్రసాద్ పేర్కున్నారు.పట్టణంలోని సిహెచ్‌సి కేంద్రంలో సోమవారం విలేఖర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఇటీవల ఆసుపత్రిలోని వైద్య సిబ్బంది రోగుల పట్ల దురుసుగా ప్రవర్తించారనే విషయం బయట సమాచారం రావడంతో అధికాస్తా సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయింది.ఈనేపద ్యంలో డాక్టర్ మాట్లాడుతు రోగుల పట్ల వైద్య సిబ్బంది దురుసుగా ప్రవర్తించడం తప్పేనని మరోకమారు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని అన్నారు. అలాగే వైద్యసిబ్బంది నరుసులలో అంతర్గతంగా ఆదిపత్యపోరు నెలకొన్న పరిస్దితులలో గత నాలుగు రోజుల క్రితం నర్సులు,సహచర నర్సులతో ముష్టి యుద్దానికి పాలుపడిన ఘటన కాస్తా పట్టణం అంతా వ్యాపించింది.అలాగే వైద్యసిబ్బందిలో రెగ్యులర్ అయిన హెడ్ నర్సులు, తాము డ్యూటి చేయకపోయినా తమను ప్రశ్నించే అధికారం లేదని మా పనిబారం కూడా కాంట్రాక్ట నర్సులు,ఎన్‌హెచ్‌ఎం నర్సులు చేయాల్సిందేనంటు వారు హుకుం జారి చేయడం ఈవిషయమై ప్రశ్నించిన జూనియర్ నర్సులకు ,హెడ్‌నర్సులకు తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది.గతంలో ఇటువంటి ఘటనలు సిహెచ్‌సిలో ఎప్పుడు చోటు చేసుకోలేదు. ఈవిషయం తెలిసిన పొదలకూరు గ్రామ పంచాయితీ ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి,వైసిపి నాయకుడు స్వర్ణాశేకర్ సిహెచ్‌సి డ్రాయింగ్ అధికారితో మాట్లాడి తక్షణం వైద్యాధికారులు సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు.కోట్ల రూపాయలు ఖర్చుతో భవన నిర్మాణం అత్యాధునికి పరికరాలు,ఆపరేషన్ దియోటర్ల,అన్ని వ్యాధులకు మందులు,రక్త పరీక్షలు,ఎక్స్ రే విభాగం వంటి మెరుగైన వైద్యసేవలు అందించేందుకు మంత్రి కాకాణి గోవర్దన్‌రెడ్డి సౌజన్యంతో పొదలకూరు సిహెచ్‌సిలో అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని రోగుల పట్ల నిర్లక్ష్యం వహించి వైద్యసేవలకు అంతరాయం కలిగితే మంత్రి దృష్టికి పోతే ఉపేక్షించరని సమీష్టిగా డాక్టర్లు,వైద్యసిబ్బంది,మహిళా ఉద్యోగులు,రోగులకు ప్రేమానారాగాలతో సహృదయంతో పనిచేస్తు రుగ్మతలతో వచ్చిన రోగులకు భుజం తట్టి ధైర్యం చెప్పి వ్యాధి నయం అయిపోతుందంటు భరోసా ఇవ్వాలని వారు సమావేశంలో మాట్లాడారు.చివరిగా డ్రాయింగ్ అధికారి ప్రసాద్ జోక్యం చేసుకుంటు భవిష్యత్తులో సామాజిక వైద్య కేంద్రంలో ఇటువంటి పరిణామాలు చోటు చేసుకునే అవకాశం లేదని దురుసుగా వైద్యసిబ్బంది ప్రవర్తించినట్లు తన దృష్టికి వస్తే తక్షణం చర్యలు చేపడతానని ఇందుకు తాను ఎల్లవేళలా విధులలో నేరుగా లేనప్పుడు పోన్ ద్వారా అందుబాటులో ఉంటానని సమస్యలు ఎదుర్కున్న వారు తనను సంప్రదించ వచ్చునని రోగులకు భరోసా ఇచ్చారు.గత వారం పది రోజుల నుండి సిహెచ్‌సిలో చోటు చేసుకున్న పరిణామాలు పట్టణంలో వ్యాప్తించడంతో ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి ఈ సమావేశం ఏర్పాటుచేసి సమస ్యకు చెక్ పెట్టారు.